
# నవభూమి

జిల్లా అనుబంధం

04 జులై,2025 శుక్రవారం పేజీలు:13

www.epaper.navabhoomi.in



# అశ్వరావుపేట అందంగా ఉండాలి

- అధికారులతో ఎమ్మెల్యే జారే, మంత్రి తుమ్మల సమీక్ష
- డివైడర్లు సకాలంలో ఎందుకు పూర్తి చేయలేదు
- నాణ్యతతో కూడిన పనులు చేయాలి
- కొందరు అధికారుల తీరు మార్చుకోవాలి
- సీతారామ కాలువల కోసం భూసేకరణ పూర్తి చేయండి: మంత్రి తుమ్మల ఆదేశం

**దమ్మపేట / కొత్తగూడెం జులై 3 నవభూమి ప్రతినిధి:** అశ్వారావుపేట నియోజవర్గం అందంగా ఉండాలని, సమస్యలు ఉంటే ఎమ్మెల్యే ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్ళాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గురువారం గండుగులపల్లి లోని తన స్వగృహంలో అధికారులు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తో కలిసి సమీక్ష నిర్వహించారు.

సమీక్ష లో రోడ్లు, సెంట్రల్ లైటింగ్, చెరువులు, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుగా ఉన్న అశ్వారావుపేట ను తెలంగాణ గుమ్మంగా తీర్చి దిద్దాలని మంత్రి తుమ్మల కోరారు. దమ్మపేట అశ్వరావుపేట మండలాల్లో అత్యధికంగా పామాయిల్ సాగు చేసే విధంగా కృషి చేయాలని తుమ్మల వ్యవసాయక అధికారులను ఆదేశించారు. రైతులకు సకాలంలో రైతు భరోసా అందించామని పంటల నిర్వహణపై శాటిలైట్ ద్వారా పంటల సమాచారాన్ని స్వీకరించి రైతులకు అందిస్తామన్నారు. అశ్వరావుపేటలో డివైడర్ పనులు సకాలంలో ఎందుకు పూర్తి చేయలేదని వర్షాలు వస్తుంటే పనులు ఎలా చేస్తారని నాణ్యత ఎలా ఉంటుందని మంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అశ్వరావుపేట మెయిన్ రోడ్డు గోతులమయంగా మారిందని అధికారులను మందలించారు. పట్వారి గూడెం మందలపల్లి లో రింగ్ సెంటర్ లను అభివృద్ధి చేయాలని పట్వారిగూడెంలో రోడ్డు నాలుగు లైన్లుగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సైడ్ డ్రైనేజీ ల పై ఆక్రమణలు చేపడితే పోలీసుల సహకారంతో చర్యలు తీసుకోవాలని దొంతికుంట చెరువును సర్వే చేయించి ఆక్రమణలు లేకుండా ప్రజలకు ఉపయోగపడేలా సుందరీకరించాలని కోరారు. పెద్దవాగు ప్రాజెక్టు రింగుబండ్ ఈ వర్షాకాలంలో తెగిపోకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. ఈ ప్రాజెక్టు గతంలో తెగిపోవడానికి అధికారుల అసమర్థతే కారణమని మళ్లీ అలా జరుగుతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువల పనులను చేపట్టేందుకు భూసేకరణ పూర్తి చేసి వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి దమ్మపేట అశ్వరావుపేట మండలాలకు గోదావరి జలాలు అందిస్తే భూగర్భ జలాలు పెరుగుతాయి అన్నారు. గుబ్బల మంగమ్మ ఆలయాన్ని అశ్వరావుపేట రేంజ్ పరిధిలో ఫారెస్ట్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. టూరిజం అభివృద్ధి చేయాలని ప్లాస్టిక్ రహితంగా మార్చాలన్నారు. గిరిజన గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి ఫారెస్ట్ అధికారులు అడ్డంకులు సృష్టించవద్దన్నారు. వివిధ శాఖల అధికారుల పనితీరు. మార్చుకోవాలని హెచ్చరించారు. సమస్యలు ఏమైనా ఉంటే ఎమ్మెల్యేతో చర్చించి పరిష్కరించుకోవాలని అక్కడ పరిష్కారం కాని సమస్య ఉంటే ప్రభుత్వం దృష్టికి వస్తాయన్నారు. అశ్వరావుపేట నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు సోలార్ ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన చోట వ్యవసాయానికి సోలార్ పంప్ సెట్ లు ఉపయోగించే విధంగా ఎమ్మెల్యే ఆదినారాయణ కు మంత్రి తుమ్మల సూచించారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట, దమ్మపేట తహసీల్దార్లు, విధ్యుత్, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, అటవీ, పంచాయతీ రాజ్, పోలీస్ శాఖ శాఖ అధికారులు, వివిధ శాఖల, డీఈలు, శ్రీధర్, ప్రకాష్, కృష్ణ, ట్రాన్స్కో నుండి రవికుమార్, అశ్వరావుపేట తాసిల్దార్ రామకృష్ణ, రేంజ్ అధికారులు శ్రీనివాసరావు, మురళి, ఆయిల్ ఫెడ్ రాష్ట్ర అధ్యక్షులు ఆలపాటి ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కొయ్యల అచ్యుత రావు, కాసాని నాగ ప్రసాద్, కె వి సత్యనారాయణ, మన్యం అప్పారావు, ఎర్ర వసంతరావు, మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వర రావు ఉన్నారు

## ప్లాస్టిక్ భూతంపై "శివా"లెత్తిన పర్యావరణ

2



# విపత్కర సమయాల్లో ప్రజలకు అందుబాటులో

- జిల్లా పోలీస్ శాఖ తరపున ఐదు డిడిఆర్ఎఫ్ బృందాలు
- సమన్వయ సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు





**కొత్తగూడెం జులై 3 నవభూమి ప్రతినిధి:** రాబోయే వర్షాల దృష్ట్యా సంభవించే వరదలలో ప్రమాదవశాత్తు చిక్కుకున్న భాదితులను రక్షించడానికి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అయిదు డీడిఆర్ఎఫ్ బృందాలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటాయని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేందుకు వీలుగా అన్ని శాఖలతో సమన్వయం పాటిస్తూ ముందుకెళ్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే గురువారం జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు, 6వ బెటాలియన్ టీజీఎస్పి అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాలోని ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి ప్రత్యేకంగా శిక్షణను పొందిన డిడిఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా గోదావరి నది వరదలు సంభవించినప్పుడు నదీ పరివాహక ప్రాంతాలలో నివసించే లోతట్టు ప్రాంత ప్రజలను సంరక్షించడానికి ఈ బృందాలు ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. రెస్క్యూ సమయంలో అవసరమయ్యే లైవ్ జాకెట్స్, లైఫ్ బాయ్ రింగ్స్, బోట్ పెడల్స్, రోప్స్, ఇతర సామాగ్రి మొత్తాన్ని ఈ బృందాలకు సమకూర్చడం జరిగిందన్నారు. జిల్లాలో ఏ ప్రాంతంలో ఎలాంటి విపత్తు ఎదురైనా అక్కడి బాధితులను సంరక్షించేందుకు సమన్వయంతో అన్ని శాఖల అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. రాబోయే భారీ వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంత ప్రజలు కూడా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విపత్కర సమయాల్లో డయల్ 100 కు ఫోన్ చేసి పోలీస్ వారి సేవలను వినియోగించుకోవాలని తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి క్రాంతి కుమార్, 6వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాస్, ఆపరేషన్స్ ఆర్ఐ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

# 9న జరిగే సమ్మెను విజయవంతం చేయండి

- సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు జేఏసీ నాయకుల పిలుపు 11

**కొత్తగూడెం జులై 3 నవభూమి ప్రతినిధి:** ఈనెల 9వ తేదీన జరగనున్న దేశవ్యాపిత ఒక్కరోజు సార్వత్రిక సమ్మెలో సింగరేణి అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం కొత్తగూడెం కార్పోరేట్ హెడ్ ఆఫీస్ ఇల్లందు బంగ్లోస్ వద్ద కాంట్రాక్ట్ కార్మికుల గేట్ మీటింగ్ ల ను జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, ఏఐటియుసీ నుండి యర్రగాని కృష్ణయ్య, ఐ ఎన్ టి యు సి నుండి పితాంబరం, ఆల్బర్ట్ సిఐటియు టి యు సి ఐ నుండి పి సతీష్ లు పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను అత్యంత దుర్మార్గంగా రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి కార్మిక హక్కులను హరించేస్తుందని విమర్శించారు.



# ఆడబిడ్డను అక్కున చేర్చుకుని అభయాస్తం అందించిన కృష్ణా, అర్జునులు

## ఎమ్ పీ రఘురాం రెడ్డి మంత్రి. పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**తిరుమలాయపాలెం నవభూమి జూలై 03-** కూసుమంచి మండలంలోని ధర్మాతండాలో మంచం మీద అచేతన స్థితిలో ఉన్న పరశురాం కూతురు సింధు ఆరోగ్య పరిస్థితి గురించి సింధు తల్లి లలితను అడిగి తెలుసుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి. కూసుమంచి మండల పర్యటనలో భాగంగా ధర్మతండాలో ఇటీవల మృతి చెందిన పరుశరామ్ కుటుంబాన్ని పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పరశురాం కుమార్తె ఆరోగ్య పరిస్థితిని అతని భార్య లలితను అడిగి తెలుసుకున్నారు. మంత్రి ముందు లలిత కన్నీటి పర్యాంతమై తన బాధను చెప్పుకున్నది. వెంటనే మంత్రి పొంగులేటి స్పందించి ఎంపీ రఘురాం రెడ్డి, తాను కలిసి స్వయంగా హైదరాబాద్ హాస్పిటల్ కి వచ్చి డాక్టర్ల తో మాట్లాడి మీ కూతురుకి వైద్యం చేపిస్తామని హామీ ఇచ్చారు. అంతేగాక ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న సీఎం రిలీఫ్ ఫండ్ బిల్లులన్ని మంజూరు చేపిస్తానని హామీ ఇచ్చారు. అధైర్య పడకు అక్కా నేను అండగా ఉంటానని మీ కుటుంబ భాధ్యత మేము చూసుకుంటా మని హామీ ఇచ్చారు.

# మంత్రి తుమ్మలను శుభకార్యానికి ఆహ్వానించిన మాజీ జడ్పీటీసీ పైడి



**దమ్మపేట జులై 3 నవభూమి:** ఈనెల 13న సత్తుపల్లి మండల పరిధిలోని గంగారం వాసిరెడ్డి ఫంక్షన్ హాల్లో జరిగే తన మనవడి బారసాల ఆహ్వాన పత్రికను (పైడి)..రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి అందజేసి, దమ్మపేట మండల సీనియర్ నాయకులు మాజీ జడ్పిటిసి పైడి వెంకటేశ్వరరావు కార్యక్రమానికి మంత్రిని ఆహ్వానించారు

# ఉపాధి హామీ క్షేత్ర సహాయకుల జీతాలు చెల్లించండి



**జూలూరుపాడు, జూలై 03 (నవభూమి ప్రతినిధి)-** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకుల 4 నెలల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఈ జి యస్ ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం మండల అధ్యక్షుడు మూడ్ రమేష్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. గత 20 సంవత్సరాల నుండి ఉపాధిహామీ పథకం లో ఫీల్డ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్నామని ఉద్యోగం పైనే మా కుటుంబాలు అన్ని ఆధారపడి జీవిస్తున్నాయని ఆయన తెలిపారు. గత నాలుగు నెలల నుంచి వేతనాలు అందక కుటుంబాలను పోషించలేక చాలా ఇబ్బందికరంగా మారిందని తమ పిల్లలకు పాఠశాలలో ఫీజులు కట్టుకోలేక ఇంట్లో ఖర్చులు కుటుంబాలను పోషించలేక దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నామని అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు

# ప్లాస్టిక్ భూతంపై "శివా"లెత్తిన పర్యావరణ రక్షకుడు

- మానవ జీవితాలను రోగమయం చేస్తున్న ప్లాస్టిక్
- వినియోగం తగ్గించాలని ఒక్క రోజు దీక్షభూనిన శివ
- అవగాహన కల్పిస్తున్న ప్రకృతి ప్రేమికుడు తిప్పర్తి శివ





**జూలురుపాడు, జూలై 03 (నవభూమి ప్రతినిధి)-** తెల్లని దుస్తుల పై ప్లాస్టిక్ వాడకం వద్దని ప్లాస్టిక్ వద్దే వద్దు పర్యావరణమే ముద్దు ముద్దు, ప్లాస్టిక్ వ్యర్థం ఆరోగ్యానికి అనర్థం,నినాదాలు.ఒక చేతిలో వస్త్రపు సంచి,మరో చేతిలో మైకు ద్వారా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ మండల వ్యాప్తంగా ప్రజలకు విద్యార్థులకు వ్యాపారస్తులకు అవగాహన కల్పిస్తూ మండల కేంద్రంలో ఒక్క రోజు దీక్ష కు పూనుకున్నాడు ఒక వ్యక్తి. సుమారు నాలుగు దశాబ్దాలుగా జూలురుపాడు మండలంతో ఆయన జీవన యానం. అతనొక సాధారణ ప్రభుత్వ ఉద్యోగి.

అతని ఆలోచనంతా సామాజిక మార్పు కోసం ఆరోగ్య రక్షణ, ప్రకృతి పరిరక్షణ కోసం పరితపిస్తుంటారు.ప్రతి విషయంలోనూ ప్రగతి ఉండాలంటారు.కొన్ని విషయాల గురించి అందరికీ తెలిసినా మౌనంగా ఉంటారు. ఆయన మాత్రం కుండ బద్దలు కొడతారు.తాజా గా గురువారం అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని మానవ ఆరోగ్యానికి ప్లాస్టిక్ చేస్తున్న నష్టాన్ని ప్రజలకు తెలియ పరచాలని వినూత్న కార్య క్రమం చేపట్టారు. మండల కేంద్రంలో విద్యాలయాలు,ప్రధాన రహదారిలో ప్రజలకు అవగాహన కల్పించారు.ఆయన ఎవరో కాదు మండల పరిధిలోని పాపకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉద్యోగిగా పనిచేస్తున్న తిప్పర్తి శివ. మండల ప్రజలకు చిర పరిచితుడు. ఆరోగ్య రక్షణ కోసం ప్రతి ఉదయం ఉద్యమ రీతిలో యోగ సాధన చేస్తున్న ఆరోగ్య జీవన యాత్ర గ్రూప్ సభ్యులు గా కొనసాగుతూ అనేక మందికి వ్యాయామం, యోగ,ధ్యానం గురించి అవగాహన కల్పించుటలో ప్రత్యేక బాగస్వామిగా ఉంటారు. యోగా సాధకులకు కావలసిన వస్తువులు అందించుటలో ముందు వరుసలో ఉంటారు.మొక్కల పెంపకం ప్రకృతి సంరక్షణలో పద్మశ్రీ వనజీవి రామయ్య ను ఆదర్శంగా తీసుకొని పర్యావరణ పరి రక్షణ పై యోగ బృందంతో కలసి సభలు,ప్రదర్శనలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ఇటీవల వెంగన్నపాలెం వైకుంఠ ధామంలో మొక్కలు నాటి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వలన మానవ జీవితం పాతాళానికి తొక్కివేయబడింది. దానిని ప్రజలు గ్రహించలేక పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.మనిషి జీవితం నిత్యం ప్లాస్టిక్ తోనే ముడిపడి ఉందని అన్నారు.టీ కప్పు,అన్నం తినే ప్లేటు,వస్తువులు,కూరగాయలు, నిత్యావసరకులు తీసుకు వెళ్ళడానికి ప్రతి పనికి ప్లాస్టిక్ వాడుతున్నామని వాటిలో కంటికి కనపడని సూక్ష్మ స్థాయి ప్లాస్టిక్ రేణువులు దేహంలోని వెళ్లి క్యాన్సర్ కారకాలు మారుతున్నాయని అనేక పరిశోధనలు వెల్లిడిస్తున్నాయి.ఈ మధ్య కాలంలో మన చుట్టూ క్యాన్సర్ రోగులను చూస్తుండమే నిదర్శనమన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమి లో అనేక సంవత్సరాలు ఉంటాయని దాని వలన నీటి కాలుష్యం వలన చేపలు,రోడ్ల పై పశువులకు హాని కలిగిస్తుంది. మానవ జీవితానికి సవాలు గా మారిన ప్లాస్టిక్ భూతాన్ని అంతం చేద్దామని పిలుపునిచ్చారు.ప్రతి ఒక్కరు విధిగా పేపర్,వస్త్రం తో తయారైన సంచులను వాడాలని కోరారు.

భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించుట మనందరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు తప్పెట లక్ష్మీ నరసయ్య, ఉపాద్యాయులు జక్కుల శ్రీనివాస్,తెలంగాణ ఉద్యమ కారులు వేల్పుల నరసింహారావు,కార్మిక నాయకులు ఏదుల పురం గోపాల రావు,తాళ్లూరి లక్ష్మయ్య,యోగ బృంద సభ్యులు వేల్పుల బోస్, పోలీస్ అధికారి దయానంద్,తాళ్లూరి నవీన్, పెండ్యాల నరేష్,మద్దినేని కిరణ్,వల్లోజీ రమేష్,హనుమంత రావు,ప్రముఖ వ్యాపారి చల్లా జనార్ధన రావు,వందనపు కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.సమాజ హితం కోసం,ప్రజా క్షేమం కోసం స్వచ్ఛందంగా కార్య క్రమాలు చేస్తున్న తిప్పర్తి శివ ను నవ భూమి మనస్ఫూర్తిగా అభినందిస్తున్నది.



# పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను చెల్లించండి!

- పిడియస్‌యు డిమాండ్




**గుండాల జులై 3 నవభూమి:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా విద్యార్థులకు రావలసిన ఫీజు బకాయల విషయంలో స్పందించకుండా విద్యార్థులకు మొండి చేయి చూపిస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై విద్యార్థులు రాజీలేని పోరాటానికి సిద్ధపడాలని పి డి యస్ యూ ఇల్లందు డివిజన్ కార్యదర్శి బానోత్ నరేందర్ అన్నారు. పి డి యస్ యూ గుండాల మండలం ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటుందని వారు అన్నారు. గత మూడు సంవత్సరాల నుండి విద్యార్థులకు రావలసిన ఎనిమిది వేల కోట్ల రూపాయల ఫీజు బకాయలను చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని, గత కేసీఆర్ ప్రభుత్వానికి పట్టిన గతే నేటి రేవంత్ రెడ్డి సర్కార్ కు పడుతుందని వారు హెచ్చరించారు. నెల నెలా ప్రజాప్రతినిధులకి జీతాలు చెల్లించే ప్రభుత్వం విద్యార్థులకు ఎందుకు మొండి చేయి చూపిస్తుందని ప్రశ్నించారు. ఏ ప్రభుత్వ హయాంలో లేని విధంగా విద్యాసంస్థలు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించబోమని విద్యాసంస్థలు బంద్ పాటిస్తున్నాయని చెప్పినా ఏమాత్రం పట్టింపు లేని రేవంత్ రెడ్డి పాలన ప్రజాపాలన ఏవిధంగా అవుతుందని వారు అన్నారు. ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ రాకపోవడంతో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఫీజులు చెల్లిస్తేనే ఇస్తామని ఒత్తిడి చేస్తున్నా ప్రభుత్వం నుండి ఏమాత్రం స్పందన లేకపోవడం బాధాకరమని రియంబర్స్మెంట్ పథకాన్ని నిర్లక్ష్యం చేసి భవిష్యత్తులో ఎత్తివేయడం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం కుటిల ప్రయత్నాలు కొనసాగిస్తుందని వారు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ ని తక్షణమే విడుదల చేయాలని లేని పక్షంలో విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలో చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు రేవంత్ ప్రవీణ్ లోకేష్ శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## భాధ్యతలు స్వీకరించిన టాస్క్ ఫోర్స్ ఏసిపి, ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్




**ఖమ్మం క్రైం, నవభూమి, జూలై 3:** టాస్క్ ఫోర్స్ ఏసిపి గా సత్యనారాయణ, మహిళా పోలీస్ స్టేషన్ ఎఎస్ హెచ్ ఓ గా ఇన్స్పెక్టర్ చిట్టిబాబు గురువారం భాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయం లో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ను మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు ప్రారంభం



**ఏనుకూరు, నవభూమి, జూలై 3:** మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మొహరం వేడుకలు ఎంతో భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మొహర్రం వేడుకలతో గ్రామాలలో సందడి నెలకొన్నది. హస్సేన్, హుస్సేన్ త్యాగానికి ప్రతికగా మొహరం పీర్ల పండుగను భక్తి శ్రద్ధలతో పది రోజులు జరుపుకుంటారు. గురువారం ఏడవ షరగతును టి.ఎల్ పేట, రేపల్లెవాడ, తిమ్మారావుపేట, గార్లఒడ్డు, నాచారం గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. నిప్పుల గుండం చుట్టూ భక్తి శ్రద్ధలతో అసోయిదుల ఆడటం కులమతాలకతీతంగా ఆనవాయితీగా వస్తుంది. పీర్లను డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాన్ లాల్ బాబు, సైదులు, కాసిం, పెద్దబాబు, బాబా, టెన్త్ సాహెబ్, షరీఫ్, నాగూర్, కిలార్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైద్య శిబిరం బ్యానర్ ఆవిష్కరించిన ఎస్పి రోహిత్ రాజు




**కొత్తగూడెం జులై 3 నవభూమి ప్రతినిధి:** వికాస తరంగిణి కొత్తగూడెం శాఖ ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్య వికాస్ కార్యక్రమం శుక్రవారం రేగళ్ల గ్రామంలో ఉచిత క్యాన్సర్ క్యాంప్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు హాజరవుతారని. క్యాన్సర్ క్యాంప్ ను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వికాస తరంగిణి కోఆర్డినేటర్ గుంటూరి రమాదేవి, సభ్యులు రాజ్యలక్ష్మి, పూర్ణ మొబైల్స్ యజమాని యెల్దండి పూర్ణచందర్ రావు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు లగడపాటి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

# గిరిజన విద్యార్థులకు ఐటిడిఏ కళాశాలలో అందరికి సీట్లు ఇవ్వాలి

### ■ గోండ్వాన సంక్షేమ పరిషత్ డిమాండ్



**చర్ల జులై 3 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల కేంద్రంలో పూనెం వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇంటర్ సప్లమెంటరీ పాస్ అయిన గిరిజన విద్యార్థిని విద్యార్థులకు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి గురుకులాలు మరియు రెసిడెన్షియల్ కళాశాలలు ఏకలవ్య కళాశాలలో అందరికీ సీట్లు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ తరపున నుండి నడుస్తున్న కళాశాలలో సీటు దొరకకపోవడంతో ప్రైవేటు విద్యా సంస్థలు దండుకుంటున్నారని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో మాట్లాడి దరఖాస్తు పెట్టుకున్న ప్రతి విద్యార్థికి సీటు వచ్చేలా అధికారులు సోరవ చూపాలని లేకపోతే విద్యా సంవత్సరం నష్టపోయి డ్రాప్ అవుట్ గా మిగిలే అవకాశాలు ఉన్నాయని ఆరోపించారు. %వాజ్రా%ఎస్ సి ఆర్ పి వ్యవస్థలో సీనియర్ ఉపాధ్యాయులకు అవకాశం ఇవ్వకుండా జూనియర్ ఉపాధ్యాయులకు ఇవ్వడంతో అక్కడ పనిచేసే సీనియర్ ఉపాధ్యాయుల మనోభావాలు దెబ్బతినే అవకాశం ఉన్నందున అనుభవం ఉన్న ఉపాధ్యాయులనే ఖాళీ అయిన ఎస్ సి ఆర్ పి. స్థానాలలో భక్తి చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్డిమాండ్చేస్తుంది. చింతగుప్ప ఐటీడీఏ స్కూలు లో 17 మంది విద్యార్థులు ఉంటే ముగ్గురు టీచర్లు ఉన్నారు. ఆ యొక్క స్కూలు బిల్డింగు శిధిలావస్థలో చేరుకుంది. ఐటీడీఏ అధికారులు ముందుచూపుతో అక్కడ కొత్త బిల్లింగ్ కి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నాము. ఈ యొక్క కార్యక్రమంలో సరెం రవీంద్ర, శరెం సుధాకర్, పాలెం నాగరాజు, కలం శ్రీను పాల్గొన్నారు.

# క్రమశిక్షణ ఉన్నత స్థానానికి మార్గం

### ■ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సాగి సుజాత



**ఏనుకూరు, నవభూమి, జూలై 3:** విద్యార్థులు విద్యార్థి దశ నుండే క్రమశిక్షణ అలవర్చుకుని చదివి ఉన్నతమైన స్థానాలకు ఎదగాలని బురద రాఘవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సాయి సుజాత కోరారు.మండల పరిధిలోని బురద రాఘవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 60 మంది విద్యార్థులకు తన సొంత ఖర్చులతో 8000 విలువ చేసే టైలు, బెల్టులు, ఐడి కార్డులు పాఠశాల హెచ్ఎం సాగి సుజాత, పొట్ట రామారావు దంపతులు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం సాగి సుజాత మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలకు దీటుగా విద్యార్థులు పూర్తి యూనిఫామ్ తో రావాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఇచ్చిన యూనిఫామ్ కి తోడుగా ఈ టై, బెల్ట్, ఐడికార్డ్స్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో అధిక సంఖ్యలో అడ్మిషన్లు జరిగాయన్నారు. విద్యార్థులు మంచిగా చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తెచ్చి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. అనంతరం పాఠశాల సిబ్బంది,విద్యార్థులు పాఠశాల హెచ్ఎం శ్రీమతి సాగి సుజాత దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎం పుల్లయ్య, డి శ్రీనివాస్, ఆర్ విజయశ్రీ, కె భారతి, బి నాగేశ్వరావు, టీ నరేష్, యస్ బావ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అశ్వారావుపేట మండల పాస్టర్స్ ఫెలోషిప్ మీటింగ్




**అశ్వారావుపేట టౌన్ 3 నవభూమి:** అశ్వారావుపేట పట్టణంలో రెవ వెలుగు జాకబ్ బాబు హల్లేలూయ ప్రార్థన మందిరంలో అశ్వారావుపేట మండల పాస్టర్స్ ఫెలోషిప్ మీటింగ్ ఎంతో ఘనంగా జరిగింది. ఇండియన్ క్రీస్టియన్ డే సందర్భంగా ఈ మీటింగ్ లో, దైవ సందేశం, బ్రదర్ జాన్సన్, మరియు నెహేమ్య, బోధించారు. ఈ కార్యక్రమంలో పేదా సేవకులైన ఊట్లపల్లి పాస్టర్ జాషువా మందిరానికి ఫేలోషిప్ తరుపున సీలింగ్ ఫ్యాన్ ఇవ్వడం జరిగింది. ఫేలోషిప్ ప్రెసిడెంట్ గుబ్బల సుజీవరాజు హల్లేలూయ ప్రార్థన మందిరానికి కొన్ని ట్యూబ్ లైట్లు స్పాన్సర్ చేయటం జరిగింది. వచ్చిన పాస్టర్స్ అయిన వారికి గౌరవ అధ్యక్షులు రెవ వెలుగు జాకబ్ బాబు ప్రేమ విందు ఏర్పాటు చేసిరి.ఈ మీటింగ్ లో వైస్ ప్రెసిడెంట్ కే వరప్రసాద్ జాయింట్ సెక్రటరీ రవిబాబు, ట్రేజరర్ జి జాషువా, సలహాదారులు, బి జాషువా,యన్ సత్యం, పి జాన్, యం అబ్రహం, మత్తయి, ఫేలోషిప్ పాస్టర్స్, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయిస్తున్న డెలివరీ బాయ్ అరెస్ట్

### ■ 2.1 కేజీల గంజాయి స్వాధీనం



**కూకట్‌పల్లి, జూలై 3 (నవభూమి ప్రతినిధి):** కూకట్‌పల్లి ఫోర్త్ స్టేజి వద్ద గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్న ఓ డెలివరీ బాయ్‌ను ఎస్‌సిఎఫ్‌డి ప్రత్యేక బృందం అరెస్ట్ చేసింది. బాలానగర్ పరిధిలో ఈ ఘటన జరిగింది..అనంతపురం జిల్లా పీకే పీ తండా, నల్లమడకు చెందిన రమావత్ లోక్నాథ్ నాయక్ (29) అనే యువకుడు, ప్రస్తుతం కేపిహెచ్బీ కాలనీలో నివసిస్తూ, డెలివరీ ఉద్యోగంతో పాటు గంజాయి విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం అందిన నేపథ్యంలో అధికారులు అతన్ని పట్టుకున్నారు. పట్టుబడిన నిందితుడి వద్ద నుండి మొత్తం 2.1 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇతను గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి యువతకు విక్రయిస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఆపరేషన్‌కు నాయకత్వం వహించిన ఎస్‌సిఎఫ్‌డి టీం లీడర్ నాగరాజు మాట్లాడుతూ, నిందితుడిని బాలానగర్ పోలీస్ స్టేషన్లో అప్పగించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

# హక్కుల పరిరక్షణకై జరిగే సార్వత్రిక సమ్మెలో భాగస్వాములు కావాలి



**గార్ల, నవభూమి, జూలై 3:** కార్మికులు సాధించుకున్న కార్మికుల హక్కులను సంరక్షించుకోవడానికి ఈనెల 9వ తేదీన దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెలో భాగస్వాములు కావాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. గార్ల సిఐటియు కార్యాలయం లో బండ్ల అప్పిరెడ్డి అధ్యక్షతన గురువారం నిర్వహించిన తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) మండల సదస్సులో పాల్గొని మాట్లాడుతూ దేశంలో బిజెపి పార్టీ మూడవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల చట్టాలకు తూట్లు పొడుస్తూ బహుళ జాతి కంపెనీ లకు ప్రయోజనాలు చేకూర్చుతున్నారని మండి పడ్డారు.దేశంలో, రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల హక్కులను కాల రాస్తూ నాలుగు లేబర్ కోడ్లులు కార్మికుల చట్టాలకు వ్యతిరేకంగా తీసుకొచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. మల్టిపర్పస్ విధానాన్ని రద్దు చేసి,జివో 51ను సవరించి, జివో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని తదితర డిమాండ్ ల పరిష్కరం కోసం జరిగే సమ్మెలో కార్మికలోకం పాల్గొనాలని కోరారు.ఈ సదస్సులో సిఐటియు జిల్లా కార్యదర్శి కుంట.ఉపేందర్,మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాస్, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు సుధాకర్,మండల నాయకులు పి.దాస్,దస్తాగిరి,పి.రమేష్,భద్రు,వీరాస్వామి, అశోక్, పాల్గొన్నారు

# గంగారం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరం



**టేకులపల్లి జూలై 3 నవభూమి ప్రతినిధి:** గంగారం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సులానగర్ ప్రభుత్వ వైద్యాధికారి కందుల దినేష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి, పిల్లలకు చికిత్స అందించడం జరిగింది. అనంతరం పిల్లలకు వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యాధులకు దూరంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, చక్కటి పోషకాహారం తీసుకోవడం ఆరోగ్యకరమని తెలిపారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం, రెండు పూటలా శుభ్రంగా నోటిని బ్రష్ చేసుకోవాలని, అలాగే రెండు పూటలా స్నానం చేయాలని, వదులుగా ఉన్న బట్టలు ధరించాలని, తడి బట్టలు ఉపయోగించరాదని, పరిశుభ్రత లోపించడం వల్ల చర్మ సంబంధితమైన అంటు వ్యాధులు ఒకరి నుంచి ఒకరికి చాలా త్వరగా వ్యాపిస్తాయని, తద్వారా నిద్రలేమితో చదువుల్లో ఆటల్లో వెనుకబడె అవకాశం ఉంటుంది కాబట్టి చక్కటి పరిశుభ్రమైన అలవాట్లు కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. చర్మ సంబంధితమైన వ్యాధులు ఉన్న పిల్లల బట్టలు డెటాల్ లో ఉతికి బాగా ఎండకు ఎండిన తర్వాతనే ఉపయోగించాలని, ఒకరు వాడిన బెడ్ షీట్స్, టవల్స్, బట్టలు ఎట్టి పరిస్థితుల్లో మరొకరు వాడరాదని పిల్లలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 56 మంది విద్యార్థులకు సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణ కొరకు స్క్రీనింగ్ పరీక్షలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి దేవా, సూపర్వైజర్ పోరండ్ల శ్రీనివాస్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు శైలజ, హారిక, ధనసరి, రాంబాబు, ప్రధానోపాధ్యాయులు జగన్ పాల్గొన్నారు.

# విష జ్వరాలు వచ్చే అవకాశం ఉంది

## ■ సన్నద్ధంగా ఉండండి: కలెక్టర్ జీతేష్ వి పాటిల్



**కొత్తగూడెం జులై 3 నవభూమి ప్రతినిధి:** జిల్లాలో భారీ వర్షాలు నేపథ్యంలో రాబోయే రోజుల్లో విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున ఆసుపత్రి సిబ్బంది పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని కలెక్టరేట్లో గురువారం సమీక్షలో కలెక్టర్ జీతేష్ వి పాటిల్ వివిధ ఆసుపత్రుల సూపరింటెండెంట్ లకు ఆదేశాలు ఇచ్చారు. అన్ని రకాల మందులు, రీఏజెంట్లు, టెస్టింగ్ కిట్లు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలని చెప్పారు. వివిధ హోదాల్లో ఉన్న వైద్య సిబ్బంది సమయపాలన పాటించి 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. ఇప్పటికే అన్ని ఆసుపత్రులలో కావాల్సిన మందులు రీఏజెంట్లు, మౌలిక వసతులు, ఆధునిక యంత్రాలు ఏర్పాటు చేసిన క్రమంలో రాబోయే రోజుల్లో రోగులను ఎటువంటి ఇబ్బంది లేకుండా పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని సూచించారు. అదేవిధంగా ఆసుపత్రులలో ఎటువంటి చిన్న చిన్న సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి తగిన పరిష్కార ఏర్పాట్లు తాను చేస్తానని, అవసరమైన నిధులు మంజూరు కి ఏర్పాట్లు చేస్తానని తెలిపారు. ఆసుపత్రిలో ఇన్సులిన్, మలేరియా మందులు అందుబాటులో లేవని వాటి గురించి వైద్య సిబ్బంది జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా రాష్ట్ర అధికారులతో మాట్లాడి వాటిని అందుబాటులోకి తీసుకొనిరాడానికి ఏర్పాటుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు .ఈ సమీక్ష సమావేశంలో జిల్లా డిసిహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, వివిధ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, ఫార్మసిస్టులు ,నర్సింగ్ సూపరింటెండెంట్ లు, శానిటేషన్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# ఏఐవైఎఫ్ జిల్లా 2వ మహాసభను జయప్రదం చేయండి

## ■ ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.కె నాగుల్ మీరా



**కొత్తగూడెం జులై 3 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం సింగరేణి కార్మిక ప్రాంతం రామవరం పట్టణంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రెండవ మహాసభ జూలూరుపాడు లో ఈ నెల జూలై 5 న జరిగే మహాసభను జయప్రదం చేయాలని కరపత్రాలు ఆవిష్కరించి ప్రచారం నిర్వహించిన జిల్లా కార్యదర్శి ఎస్కె నాగుల్ మీరా. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐవైఎఫ్ 1959 మే 3న ఆవిర్భవించిందని దేశం కోసం ప్రాణాలర్పన చేసిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్, చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు లాంటి అమరవీరుల వారసత్వాన్ని పునికి పుచ్చుకొని యువజన హక్కుల సాధనకై సామాజిక అభివృద్ధికై పాటుపడుతూ యువజన ఉద్యమాలను ముందుకు కొనసాగుతుందన్నారు.

**ఈ మహాసభల్లో ప్రధాన డిమాండ్లు :**

1) జిల్లాలో పరిశ్రమలలో స్థానిక యువతకు ఉపాధి అవకాశం కల్పించాలని.
2) నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి 5000 /-రూపాయలు తక్షణమే ఇవ్వాలని.
3) డ్రగ్స్ మత్తు పదార్థాలు విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని.
4) రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని.

తదితర డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని తయారు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి బరిగెల భూపేష్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ ఖయ్యూమ్, ఏఐవైఎఫ్ పట్టణ నాయకులు గోపి, దిలీప్, భానోత్ శ్రీను, రసూల్, జావిద్, రవి,ఉదయ్, వెంకట్, రోహిత్, శ్రీకాంత్, హరీష్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు

# జులై 6న ఇల్లెందులో భవన నిర్మాణ కార్మిక సంఘం

# రాష్ట్ర ప్రథమ మహాసభలు







**ఇల్లెందు రూరల్ జులై 3 నవభూమి ప్రతినిధి:** సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ చంద్రన్న పార్టీ అనుబంధ తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఇఫ్టూ) రాష్ట్ర ప్రథమ మహాసభలను జులై 6వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణంలో నిర్వహించనున్నారు. దానికి సంబంధించిన పోస్టర్ ను గురువారం ఇల్లెందు మండలం ఉమ్మడి చల్లసముద్రం గ్రామ పంచాయతీలోని వివిధ పెంకు ఫ్యాక్టరీ లలో ఆవిష్కరించారు. ఇఫ్టూ జాతీయ అధ్యక్షులు ఆరెల్లి కృష్ణ, టైల్స్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి రాంసింగ్ ల ఆధ్వర్యంలో ఈ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆరెల్లి కృష్ణ మాట్లాడుతూ భారత దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యంత పెద్ద రంగం ఏదైనా ఉందంటే అది భవన నిర్మాణ రంగమే అని అన్నారు. ఎంతో కీలకమైన ఈ రంగంలో దేశ వ్యాప్తంగా పది కోట్లకు పైగా కార్మికులు పనిచేస్తున్నారని, నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సమగ్రమైన సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలని ఇఫ్టూ నాయకత్వాన నిర్వహించిన పోరాటాల ఫలితంగా 1996లో ఆనాటి యుడిఎఫ్ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని తీసుకొచ్చిందని అన్నారు. ఇంతటి భలమైన కార్మిక సంఘం మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మూతి రాంబాబు, సనప రాంబాబు, కుర్ర కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతన్న కూ యూరియా కష్టాలు

**తగిన సరఫరా లేక ఇబ్బంది**

**రోజంతా లైన్‌లో నిలబడుతున్న రైతులు మహిళలు**

**పట్టించుకోని పార్టీలు, అధికారులు**

**ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు**







**గుండాల జులై 3 నవభూమి:** గుండాల మండలంలో రైతులు యూరియ మందు కట్టలు దొరకగా చాలా ఇబ్బంది పడుతున్నారు. మహిళలు రైతులు రోజంతా గంటల తరబడి నిలబడి అలసి పోతున్నారు. గుండాల కూ యూరియ సరిపడ సరఫరా లేక ప్రజలు రైతులు ఇబ్బంది పడుతున్నారు. డిసిసి కోపరేటివ్ సొసైటీ లోనే రైతులకు యూరియా ఇవ్వడంతో రైతులు భారీగా అక్కడ రోజంతా పడి గాపులు గాస్తున్నారు. గుండాల రైతులు గురించి అధికారులు పార్టీలు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యహరించడంతో రైతులలో ఆగ్రహం వ్యక్తం అవుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం మారుమూల ఏజన్సీ ప్రాంతంలో యూరియా ఎక్కువ మొత్తంలో ఉత్పత్తి చేయాలనీ రైతులు కోరుతున్నాను

# రైటర్ బస్తీ ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్

**కొత్తగూడెం జులై 3 నవభూమి ప్రతినిధి:** కొత్తగూడెం మండల పరిధిలోగల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల రైటర్ బస్తి మరియు భవిత సెంటర్ ను జిల్లా కలెక్టర్ శ్రీ జితేష్ వి పాటిల్ గురువారం అకస్మికంగా సందర్శించారు. మొదట రైటర్ బస్తి పాఠశాలలో 3 మరియు 4 తరగతులు చదువుతున్న విద్యార్థుల పఠనా సామర్థ్యాలను, విద్యార్థులు రాసిన రాత పుస్తకాలను పరిశీలించారు. అనంతరం భవిత కేంద్రాన్ని సందర్శించి సిబ్బంది బోధన విధానాలను పరిశీలించారు. సామాగ్రి అంతా అందుబాటులో ప్రదర్శితంగా ఉండాలని సూచించారు. భవిత క్యాంపు అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. కలెక్టర్ కొత్తగూడెం ఎంఈఓ డాక్టర్ ప్రభుదయాల్ కార్యక్రమంలో పాల్గొన్నారు





# భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగులకు మనోవికాసం

## ■ కలెక్టర్ జితేష్ వి.పాటిల్





**కొత్తగూడెం జులై 3 నవభూమి ప్రతినిధి:** భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగులకు మనోవికాసం కలుగుతుందని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. కొత్తగూడెం రైటర్ బస్తీలోని భవిత కేంద్రాన్ని గురువారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవిత కేంద్రంలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, నిర్వహణ విధానాలు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం కేంద్రంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ముచ్చటంచి వారికి అందుతున్న శిక్షణ, కల్పిస్తున్న సౌకర్యాలు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నాను. దివ్యాంగ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన భవిత సెంటర్లలో అన్ని సౌకర్యాలు, వసతులు కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుగా భవిత కేంద్రాలు ఉపయోగపడుతు న్నాయని, ప్రత్యేక అవసరాలు గల పిల్లల బోధన కోసం అవసరమైన అన్ని పరికరాలు, స్టడీ మెటీరియల్ తెప్పించాలని ఆదేశించారు. రెయిలింగ్, ర్యాంపు రాంప్ వంటివి పటిష్టంగా ఏర్పాటు చేయాలన్నారు. ఫిజియోథెరపిస్టు కచ్చితంగా కేంద్రానికి వచ్చేలా చూడాలని అన్నారు. భవిత కేంద్రంలో విద్యార్థుల నైపుణ్యాలను తీర్చిదిద్ది ప్రత్యేక పాఠశాల నుండి సాధారణ పాఠశాలకు పంపడానికి చేస్తున్న కృషికి సిబ్బందిని అభినందించారు. ప్రత్యేక అవసరాల పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి కావాల్సిన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఎంఈఓ డాక్టర్ ప్రభుదయాల్, తదితరులు పాల్గొన్నారు

# వంతెన లేక 'శవ' కష్టాలు

## ■ వంతెన కోసం వేడుకోలు







**టేకులపల్లి జూలై 3 నవభూమి ప్రతినిధి:** వర్షాకాలంలో తమ గ్రామం పక్కన ప్రవహిస్తున్న మొర్రేడు వాగును దాటడానికి టేకులపల్లి మండలంలోని కిష్టారం గ్రామ ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. రైతులు తమ చేలకు, పొలాలకు, సాగు పనులకు వెళ్లడానికి ఈ వాగును దాటి వెళ్లాల్సి ఉంది. వానాకాలంలో వాగు నిండుగా ప్రవహిస్తూ ఉంటుంది. ఈ కాలంలో వాగు దాటడానికి వారు చెప్పలేని ఇబ్బందులు, అవస్థలు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మృతి చెందిన వ్యక్తికి దహన సంస్కారాలు నిర్వహించడానికి వాగు దాటి వైకుంఠ దామానికి వెళ్లాల్సి ఉంది. శవాన్ని వాగు దాటించడానికి గ్రామస్తులు ఎలాంటి కష్టాలు అవస్థలు పడాల్సి వస్తుందో మనం ఊహించుకోవచ్చు. సరిగ్గా గురువారం అదే జరిగింది. కిష్టారం గ్రామానికి చెందిన కొరస నరసయ్య అనే రైతు కిడ్నీ సంబంధిత వ్యాధితో బుధవారం ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గురువారం నరసయ్య మృత దేహానికి అంత్యక్రియలు నిర్వహించాల్సి ఉంది. మృతదేహాన్ని ఉదృతంగా ప్రవహిస్తున్న వాగును దాటి తీసుకెళ్లడానికి గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఒక యుద్ధం, పోరాటమే చేయాల్సి వచ్చింది. ట్రాక్టర్లో మృతదేహాన్ని తరలించే క్రమంలో ట్రాక్టర్ వాగులో దిగబడింది. అతి కష్టం మీద ట్రాక్టర్ను వాగు దాటించి వైకుంఠధామం చేరుకొని నరసయ్య మృతదేహానికి దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దొర చింత జోగయ్య, పటేల్ జబ్బ జోగయ్య, మాజీ ఎంపీపీ పాయం లక్ష్మీనర్సు, గ్రామ పెద్దలు బోల్లి కృష్ణ, చింత రాంబాబు, వేప లక్ష్మయ్య, చింత నాగేశ్వరరావు, కంగల భద్రయ్య మాట్లాడుతూ, వాగుపై వంతెన నిర్మించాలని అనేకసార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు తమ గోడు వినిపించామని, వినతి పత్రాలు అందజేసిన ఏ ఒక్కరు కూడా తిరిగి చూడలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తాము పడుతున్న అవస్థలు, ఇబ్బందులు, కష్టాలను చూసి వంతెన నిర్మించాలని, గ్రామస్తులు ఏక కంఠంతో అధికారులను వేడుకుంటున్నారు.

# గిరిజన సంక్షేమ శాఖనూ గిరిజన ఎమ్మెల్యేకే ఇవ్వాలి

## ■ తుడుం దెబ్బ మండల అధ్యక్షులు కుంజా రమేష్ డిమాండ్



**గుండాల జులై 3 నవభూమి:** తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పదవి ధర్మపురి ఎమ్మెల్యే అట్లూరి లక్ష్మణ్ కుమార్ కు కేటాయించడం గిరిజనులను అవమానించడమే అవుతుదనీ గుండాల మండల తుడుం దెబ్బ మండల అధ్యక్షులు కుంజా రమేష్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆదివాసి సంఘాల నుండి, ఆదివాసీ మేధావులు నుండి తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆదివాసి సంఘాల మిత్రులారా వెనుకబడిన అట్టడుగు బలహీనవర్గమైన గిరిజన సంక్షేమ శాఖ పదవి గిరిజన ఎమ్మెల్యేలకు కేటాయించాలి. తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకంగా గిరిజనులకు సంస్కృతి సాంప్రదాయాలు ఆచార వ్యవహారాలు భిన్నంగా ఉంటాయి. గిరిజనుల సంస్కృతి గురించి మిగతా ఉపకులాల ఎమ్మెల్యేలకు ఏం తెలుసని కుంజా రమేష్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన నుండి ఇప్పటి వరకు ఆదివాసీల హక్కులు చట్టాలు నిర్వీర్యం అవుతున్న నేపథ్యంలో ఐటిడిఎ లు అంతం అవుతున్న నేపథ్యంలో ఆదివాసీ సమజామే ప్రశ్నార్థకంగా మారుతున్న తరుణంలో గిరిజనులుకూ ఉన్న గిరిజన సంక్షేమ శాఖనూ కూడా నిజమైన గిరిజన ఎమ్మెల్యే కు ఇవ్వకుండా గిరిజనులు సంక్షేమాన్ని సమాధి చేసినట్లు అవుతుందనీ కుంజా రమేష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిజమైన గిరిజనులు కు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పదవి ఇవ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజనులు కోరుతున్నారు. ఆదివాసి గిరిజన సంఘాలు గౌరవ షెడ్యూల్ ప్రాంత రక్షకులు. గవర్నర్ కి తక్షణమే ఫిర్యాదు చేద్దాం. మన గిరిజన ఎమ్మెల్యేలకు మన గిరిజన సంస్కృతి సాంప్రదాయాలపై ఆచార్య వ్యవహారాలపై పూర్తి అవగాహన ఉంటుంది అని గౌరవ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ కూ స్వయంగా కలిసి పిర్యాదు చేయాలి అన్నారు. ఇతర ఉప కులాల కేటాయించిన గిరిజన శాఖ మంత్రి పదవి తొలగించకుంటే తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఆదివాసీ సంఘాలు ఆందోళన నిరసన ఉద్యమానికి సిద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందనీ కుంజా రమేష్ అన్నారు

# విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అందించాలి



సత్తుపల్లి, నవభూమి, జూలై 3 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత వైద్యాన్ని తక్షణమే అందించే విధంగా చర్యలు తీసుకోవాలని టి ఎస్ జి ఆర్ ఈ ఏ (తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం) సత్తుపల్లి యూనిట్ విజ్ఞప్తి చేసింది. బుధవారం హైదరాబాదులో జరిగిన రాష్ట్ర కార్యవర్గ తీర్మాన వివరాలను సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షులు వి చెంచిరెడ్డి, సత్తుపల్లి యూనిట్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కేశవరెడ్డి, బద్రుద్దీన్ గురువారం సత్తుపల్లిలో జరిగి సమావేశంలో తెలియచేసారు. దశాబ్ద కాలంగా విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గత ప్రభుత్వం, నేటి ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉన్నాయన్నారు. ఈ ధోరణి సరికాదన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన నగదు రహిత వైద్య చికిత్సా విధానాన్ని అమలు చేస్తూ పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ కార్యవర్గ సమావేశంలో తీర్మానించినట్లు వారు వివరించారు.

# రేంజర్ శ్రీనివాసరావును సత్కరించిన మాజీ జెడ్పిటిసి పైడి



దమ్మపేట జూలై 3 నవభూమి: దమ్మపేట మండలానికి ప్రమోషన్ పై నూతన రేంజర్ గా నియమితులైన శ్రీనివాసరావు ను గురువారం సత్కరించిన మాజీ జెడ్పిటిసి పైడి వెంకటేశ్వరరావు, కొయ్యల అచ్యుతరావు, ఫారెస్ట్ డి ఆర్ ఓ జుజ్జునూరి జయరాం, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి ఘనంగా జరుపుకోవాలి

## మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పొద్దుటూరు నాగేశ్వరావు



ఇల్లెందు జూలై 3 నవభూమి ప్రతినిధి: ఆర్యవైశ్యుల ఆణిముత్యం, ఆర్యవైశ్య మహాసభ మార్గదర్శకుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 92వ జయంతి నేడు శుక్రవారం రోజున ఘనంగా నిర్వహించుకోవాలని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ, మండల మహాసభ, యువజన సంఘం, మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు కోశాధికారులు, మహాసభ రాష్ట్ర, జిల్లా జిల్లాలలో ఇల్లందు ప్రాంతం నుంచి ప్రాతినిధ్య వహిస్తున్న ప్రముఖ సీనియర్లు పాల్గొనాలని కోరారు.. తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్యుల ఆణిముత్యం, మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 92వ జయంతిని ప్రభుత్వపరంగా ప్రతి ఏడాది నిర్వహించేందుకు చర్య చేపట్టినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు

# ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

## ■ అశ్వాపురం తాసిల్దార్ మణిధర్




అశ్వాపురం జూలై 2 నవభూమి: అశ్వాపురం మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం తాసిల్దార్ మణిధర్ వివిధ శాఖ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణ మార్పుల వల్ల ఆకస్మికంగా వచ్చే వరదలు, వర్షాల సమాచారాన్ని సమన్వయం చేసుకొని శాస్త్రీయంగా విశ్లేషించుకొని ఎప్పటికప్పుడు పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు అందించేలా వ్యవస్థను రూపొందించుకోవాలని, సమాచార వ్యవస్థ మరింత బలోపేతం కావాలని అన్నారు.
రాష్ట్ర స్థాయిలో వర్షాలు, వరదలకు సంబంధం ఉన్న ఇరిగేషన్, విద్యుత్, హెల్త్, వ్యవసాయం, పోలీస్, రవాణా తదితర విభాగాలకు ప్రత్యేక నోడల్ అధికారులను నియమిస్తున్నాం. ప్రకృతి వైపరీత్యాలను మనం అడ్డుకోలేం కానీ



వాటి ప్రభావాన్ని తగ్గించడానికి ముందస్తుగా పటిష్టమైన చర్యలు తీసుకుంటే నష్టాన్ని వీలైనంతవరకు తగ్గించగలుగుతాం. ప్రధానంగా గోదావరి పరీవాహక ప్రాంతాల అధికార యంత్రాంగం వరద ముంపును ముందుగానే గుర్తించి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. దీనివలన మనం నష్టాన్ని తగ్గించినవారమవుతాం. నదీపరివాహక ప్రాంతాల్లో ఏ మేరకు వరద ఉధృతి వస్తే ఏఏ గ్రామాలు ముంపునకు గురౌతాయోనన్న సమాచారాన్ని ముందుగానే అందించాలి. ఇతర రాష్ట్రాలలో వచ్చే వరద వివరాలు, స్థానికంగా పడిన వర్షం వివరాలు, ఎంత నీటిని విడుదల చేశారనే విషయాలు సవివరంగా ఉండాలి

భారీ వర్షాలు, వరదల సమయంలో వాగుల్లో వంకల్లో చెరువుల్లో చిక్కుకున్నవారిని రక్షించడానికి ఎయిర్ లిఫ్ట్ మెకానిజాన్ని సిద్ధం చేసుకోవాలి, విపత్తు సంభవించిన ప్రాంతానికి ఏవిధంగా చేరుకోవాలి వంటి అంశాలపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మణిధర్, ఎస్సై మధు ప్రసాద్, వివిధ శాఖల అధికారులు ,కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ఏకగ్రీవంగా ఏడోసారి.... రామ్ చందర్

## ■ సిపిఐ టేకులపల్లి మండల కార్యదర్శిగా ఎన్నిక

టేకులపల్లి జూలై 3 నవభూమి ప్రతినిధి: భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) టేకులపల్లి మండల సమితి కార్యదర్శిగా గుగులోతు రామచందర్ ఏడవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు గత నెల 30వ తేదీన టేకులపల్లిలో జరిగిన పార్టీ మండల 13వ మహాసభల్లో ఈ ఏకగ్రీవ ఎన్నిక జరిగింది. దాదాపుగా 20 సంవత్సరాలకు పైగా సిపిఐ లో రామ్ చందర్ తన రాజకీయ జీవితాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో పార్టీ, దాని అనుబంధ సంఘాల్లో వివిధ పదవుల్లో ఉంటూ పార్టీ అభివృద్ధికి పాటుపడుతూ వస్తున్నారు. రాంచందర్ పార్టీ మండల కార్యదర్శిగాతో పాటు ప్రస్తుతం రైతు సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఆయన విధులు నిర్వహిస్తున్నారు. నూతన జిల్లాలు ఏర్పాటు కాక ముందు వరకు రాంచందర్ ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా పనిచేశారు. అందరితో కలుపుగోలుగా ఉంటూ, సౌమ్యుడిగా అటు పార్టీలోను, ఇటు ప్రజలలో పేరు సంపాదించుకున్న రాంచందర్, పార్టీ నాయకులతో మంచి సంబంధాలను కలిగి ఉండేవారు. ప్రస్తుతం అదే పంథానే కొనసాగిస్తూ వస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా నాయకత్వంలో ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూ, మండల కార్యదర్శిగా ముందుకు సాగుతున్నారు. అంతకుముందు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు పార్టీ కార్యదర్శులుగా పనిచేసిన టీవీ చౌదరి, సిద్ది వెంకటేశ్వర్లు, కూనంనేని సాంబశివరావు, బాగం హేమంతరావుల సారథ్యంలో రామచందర్ టేకులపల్లి మండల కార్యదర్శిగా పనిచేశారు. గత 14 సంవత్సరాలుగా మండల కార్యదర్శిగా పనిచేస్తున్న రామచందర్, తన హయాంలో ఆరుసార్లు పార్టీ టేకులపల్లి మండల మహాసభలు విజయవంతంగా నిర్వహించారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం భాగ్యనగర్ తండాకు చెందిన రామచందర్



తన రాజకీయ జీవితాన్ని, ఆ మండలంలో ప్రారంభించారు. అందులో భాగంగా మండలంలో విద్యార్థి నాయకుడిగా, యువజన సంఘం నాయకుడిగా పార్టీ అనుబంధ సంఘాల్లో పనిచేశారు. ఆ క్రమంలోనే సిపిఐ కారేపల్లి మండలం సెక్రటరీగా రెండుసార్లు బాధ్యతలు నిర్వహించారు. అనంతర కాలంలో కారేపల్లి మండలం నుంచి టేకులపల్లి మండలానికి వచ్చిన రాంచందర్ టేకులపల్లి మండల కేంద్రంలో నివాస ఉంటూ మండలంలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే స్థానిక సంస్థలకు జరిగిన ఎన్నికల్లో పార్టీ కొంతమేరకు తన సత్తా చాటుకుంది. మండలంలోని గోల్యాతండా గ్రామపంచాయతీలో రెండు వార్డులను కైవసం చేసుకుని, ఉప సర్పంచ్ పదవి దక్కడంతో, బండి రాధ ఉప సర్పంచ్ గా కొనసాగారు. అదేవిధంగా టేకులపల్లి ఎంపీటీసీ జనరల్ స్థానంలో గుగులోతు సోని రెండుసార్లు పోటీ చేసి ఓటమి చెందారు. టేకులపల్లి మండలంలో పార్టీ విస్తరణకు రాంచందర్ అడుగులు ముందుకు వేస్తున్నారు. గతంలో మండలంలో 10 సీపీఐ గ్రామ శాఖలు ఉండగా, ఇప్పుడు వాటిని 12 గ్రామ శాఖలకు విస్తరించడం జరిగింది. ఏడవ సారి ఏకగ్రీవంగా టేకులపల్లి మండలానికి పార్టీ కార్యదర్శిగా ఎన్నికైన రామ్ చందర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం పోరాటాలు నిర్వహిస్తూ, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, పార్టీ అధినాయకత్వం ఇచ్చే ఆదేశాలు, సూచనలు, సలహాల మేరకు మండలంలో పార్టీ విస్తరణకు కృషి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# విద్యార్థులకు భోజనం ఏర్పాటు

చర్ల జూన్ 3 నవభూమి ప్రతినిధి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కేంద్రంలోని ప్రముఖ వస్త్ర దుకాణం యజమాని బేత ప్రతాప్ తన మాతృమూర్తి వీరమణి జ్ఞాపకార్థం గురువారం రాత్రి వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్థులకు భోజన ఏర్పాట్లు చేసారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వనవాసీ ప్రఖండ ప్రముఖ్ గొంది శోభన్‌బాబు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని అన్నారు. దాతలు అందిస్తున్న సహకారం వృధా చేయకుండా శ్రద్ధతో చదివి తల్లిదండ్రుల కలలను నిజం చేసుకోవాలని సూచించారు. సమయం వృధా చేయకుండా, పాఠశాలలో ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను శ్రద్ధగా ఆలకించాలని కోరారు. కార్యక్రమంలో వనవాసీ నిలయ కమిటి ఉపాధ్యక్షులు జవ్వాది మురళీకృష్ణ, కోశాధికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, సభ్యులు శివరాజు



కిషోర్, రాజేష్, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి, ప్రతాప్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# మంత్రి తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిసిన సీఐ శ్రీహరి



**దమ్మపేట జులై 3 నవభూమి:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను గండుగులపల్లి ఆయన నివాసంలో గురువారం సత్తుపల్లి నూతన సీఐ తుమ్మలపల్లి శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

### సిపిఎం నాయకులు ఎంబీ నర్సారెడ్డి



**భద్రాచలం జులై 3 నవభూమి ప్రతినిధి:** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పట్టణ వ్యాప్తంగా పారిశుద్ధ్య పనులను వేగవంతంగా చేపట్టి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సిపిఐఎం 13వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఏఎంసీ కాలనీలో స్థానిక సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంసీ కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారం సైడ్ డ్రైనేజీల సమస్యలపై స్థానికులు సిపిఐఎం బృందం దగ్గర తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను ఉద్దేశించి ఎంపీ నర్సారెడ్డి మాట్లాడుతూ పట్టణ వ్యాప్తంగా డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక రోడ్లపైకి మురుగునీరు చేరుతుందని అన్నారు. నివాస గృహాల మధ్య పిచ్చి చెట్లు పెరిగి అరణ్యాన్ని తలపిస్తూ విషపాములు పురుగులు సంచరిస్తున్నాయని, రోడ్ల మీదికి వచ్చి చేరుతున్న మురుగు నీటిలో దోమలు శరీర విహారం చేస్తూ డెంగ్యూ టైఫాయిడ్ మలేరియా వంటి విష జ్వరాలు వ్యాపించే ప్రమాదం స్పష్టంగా కనబడుతుందని అన్నారు. నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్రూములలో సైతం సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఆ నీరు మొత్తం ఏఎంసి కాలనీకి వచ్చి చేరి స్థానిక ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. పంచాయతీ అధికారులు పట్టణవ్యాప్తంగా పారిశుద్ధ్య పనులను వెంటనే చేపట్టాలని లేనిపక్షంలో సిపిఐఎం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోయు జ్యోతి, అల్లాడి సత్యవతి, చిట్టిబాబు, మోహన్, పాల్గొన్నారు

# 5న కార్యకర్తలకు రాజకీయ తరగతులు



**కారేపల్లి, నవభూమి జూలై 3:** సీపీఐ(ఎం) కారేపల్లి మండల కార్యకర్తలకు రాజకీయ శిక్షణ తరగతులు ఈనెల 5,6 తేదిలలో నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎం) కారేపల్లి మండల కార్యదర్శి కే.నరేంద్ర తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ కార్యకర్తలకు సైద్ధాంతిక అవగాహన, ప్రపంచ, దేశ రాజకీయ పరిస్థితులు తెల్పటానికి గాంధీనగర్‌లో రెండు రోజుల పాటు వివిధ అంశాలపై తరగతులు బోధించటం జరుగుతుందన్నారు. రాజకీయ, సైద్ధాంతిక అవగాహన ఉండటం వలన బూర్జువ పార్టీలు అవలంభిస్తున్న విధానాలను ఎత్తిచూపవచ్చన్నారు. ఈ తరగతులను కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

# ఏజెన్సీలో విజృంభిస్తున్న విష జ్వరాలు



**మణుగూరు జులై 3 నవభూమి ప్రతినిధి:** మణుగూరు మండల, మున్సిపాలిటీ పరిధిలోని కట్టు మల్లారం, కమలాపురం, చిన్నరాయిగూడెం గ్రామాలలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. మలేరియా, డెంగ్యూ, వైరల్ జ్వరాలతో రోజురోజుకూ ప్రజలు హడలెత్తిపోతున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని చెబుతున్నప్పటికీ ప్రజలు శ్రద్ధ చూపకపోవడం వల్లనో లేదా క్షేత్రస్థాయి అధికారుల అలసత్వం వల్లనో దోమకాటు, వైరల్ ఫీవర్, విష జ్వరాలతో గ్రామాల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వర్షాలు పడుతున్నాయన్న సంబరం కంటే జ్వరాలు సోకుతున్నాయనే ఆందోళనే ప్రజల్లో ఎక్కువగా కనబడుతోంది. జలుబు, దగ్గు, తీవ్ర జ్వరాలతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల వద్ద జనం క్యూకడుతున్నారు. ప్రగతి కార్యక్రమాలు చేపట్టి చాలా చోట్ల నీటి నిల్వలు, దోమల ఆవాస కేంద్రాలు లేకుండా చేస్తున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం కనపడడం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో పెద్దమొత్తంలో మలేరియా, డెంగ్యూ, వైరల్ ఫీవర్ భారిన పడి చికిత్స పొందుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు తీవ్ర జ్వరం, దగ్గు, జలుబు, తలనొప్పితో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. మరికొందరు తీవ్ర జ్వరం, కప్పంతో ఊపిరి తీసుకోవడానికి ఇబ్బందులు పడడంతో ఆయా ఆసుపత్రులలో ఇన్‌పేషంట్‌లుగా చేరి రోజుల తరబడి చికిత్సలు పొందుతున్నారు.

**రోగులతో ఆసుపత్రులు కిటకిట**

మండలంలో విష జ్వరాలతో బాధపడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు ప్రజలు పరుగులు పెడుతుండడంతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ఈ విషజ్వరాలు అత్యధికంగా వెనుకబడిన ప్రాంతాలు, మారుమూల గ్రామాలు, గుడెలు, మురికి వాడల్లో సోకుతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతాల్లో ఎక్కువగా



పేద మధ్య తరగతి ప్రజలే ఉండడంతో ఆర్థిక స్థోమత లేక వైద్యం కోసం స్థానికంగా ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు మండల కేంద్ర ఆసుపత్రులకు తరలుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇన్ పేషెంట్ల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. మండల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల తాకిడి పెరిగిపోతుండడంతో బెడ్లను సర్దుబాటు చేయలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వైద్య సిబ్బంది పేర్కొనడం గమనార్హం. ప్రైవేట్ ఆసుపత్రులలో సైతం రోగుల సంఖ్య భారీగా పెరుగుతుందని ఆయా ఆసుపత్రుల వైద్యులు పేర్కొంటున్నారు.

**దోమల నివారణపై కార్యాచరణ ప్రకటించేనా?**

ప్రస్తుతం మండలంలో మలేరియా, డెంగ్యూ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం పదిలోపే కేసులు నమోదవుతున్నాయని చెబుతున్నప్పటికీ అనధికారికంగా అనేక ఆసుపత్రులలో 50కిపైగానే దోమకాటు బాధితులు చికిత్సలు పొందుతున్నారు. మండలంలో ఒక మున్సిపాలిటీ, 14 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. బ్లీచింగ్ పౌడర్ కి నిధులు సమకూర్చలేని పరిస్థితి అలాగే దోమల నివారణకు చర్యలు శూన్యం పైగా దోమల సంతతి పెరిగిపోయి దోమకాటు బాధితులు ఎక్కువవుతున్నారు. మున్సిపాలిటీల్లో,గ్రామాల్లో వారానికి రెండు సార్లు మందుల పిచికారీ చేపట్టి దోమల నివారణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ ప్రకటించాలని అప్పుడే దోమకాటు బాధితుల సంఖ్య తగ్గుముఖం పట్టే అవకాశం ఉందనే వాదనలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

# 9న జరుగు సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

### ■ కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు పిలుపు పిలుపు

**సత్తుపల్లి, నవభూమి, జులై 3 :** జూన్ 9న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక, రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాలు గురువారం పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా నీలం రామచంద్రయ్య భవనంలో జరిగిన సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడుతూ కేంద్రంతో దశాబ్దాల పాటు కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మిక వర్గంపై ఉన్నదన్నారు. ప్రజల ఆస్తులను కార్పొరేట్లకు దోచిపెడుతూ మతోన్మాద చర్యల ద్వారా కార్మిక వర్గ ఐక్యతకు విచ్చనం చేసే చర్యలను ప్రకటించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్మిక వర్గ సమరశీల పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను బిజెపి ప్రభుత్వం ముందుకు తెచ్చిందన్నారు. పారిశ్రామిక సంబంధాల కోడ్ ద్వారా ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్ చట్టబద్ధం చేసిందని రెగ్యులర్ ఉద్యోగాలు ఉద్యోగ భద్రతకు ముప్పు తెచ్చి పెట్టిందని ఈ లేబర్ కోడ్లు ట్రేడ్ యూనియన్లను ఉద్యోగుల కార్మిక సంఘటితశక్తిని బలహీనపరుస్తుందని వారు అన్నారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను మరల పునరుద్ధరించడం కోసం బిజెపి తీవ్రమైన ప్రయత్నాలు జరుపుతుందని, నూతన మార్కెట్ విధానాన్ని తీసుకొచ్చి



రైతాంగానికి నష్టం చేసే విధంగా సోమనాథ్ సిఫారసులను పక్కనపెట్టి అమలు చేయడం కోసం ప్రయత్నం జరుపుతుందని దీని వ్యతిరేకంగా ప్రజల పోరాడాల్సిన అవసరం ఉందని వారు అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రకటించాలని, పెట్టుబడిదారులను ప్రయోజనాల కోసం కార్మిక వర్గాన్ని బలి చేసినందుకు తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోర్సును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో టి యు సి ఐ జిల్లా కోశాధికారి ఆమర్లపూడి శరత్, ఏ ఐ టి యు జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామక్రిష్ణ, సి ఐ టి యు జిల్లా నాయకులు కోలికపోగు సర్వేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు గంటా శ్రీనివాసరావు, సిపిఎం జిల్లా నాయకులు పండు, శ్రీను, సిపిఐ జిల్లా నాయకులు దండు ఆదినారాయణ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు యోబు, రాజబాబు,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

### ■ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నర్సారెడ్డి

**బూర్గంపాడు జులై 3 నవభూమి:** బూర్గంపాడు మండల పరిధిలో సారపాక సిపిఎం పార్టీ ఆఫీసులో అనసూర్య అధ్యక్షతన జరిగిన సిఐటియు మండల కమిటీ సమావేశంలో నర్సారెడ్డి మాట్లాడుతూ కార్మికులు ఎన్నో త్యాగాల పోరాటాల ఫలితంగా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోల్డ్ గా తీసుకొచ్చి కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మికులకు తీరని అన్యాయం చేసింది వెంటనే ఈ లేబర్ కోళ్లని ఉపసంహరించుకోవాలని అన్ని రంగాల కార్మిక సంఘా లు జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్విక సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు అన్ని రంగాల ప్రజలు అన్ని రంగాల కార్మికులు ఈ జులై 9న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని కోరారు ఈ సమావేశంలో భవన నిర్మాణరంగా గౌరవ అధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు, సిఐటియు మండల కన్వీనర్ పాండవుల రామనాథం, సిఐటియు మండల కమిటీ సభ్యులు ఎస్



శ్రీను, కాంట్రాక్టు యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వెంకటరెడ్డి, పాషా తదితరులు పాల్గొన్నారు

# సేవా కార్యక్రమాలలో ఆర్యవైశ్యుల ముందు వరుసలో ఉంటారు

## ఎమ్మెల్యే కోరం కనకయ్య



**ఇల్లెందు జూలై 3 నవభూమి ప్రతినిధి:** ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో గురువారం పేద విద్యార్థుల ఉన్నత చదువు కొరకు ఉచితంగా నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వర్ రావు, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు ధారా రమేష్ లు హాజరై వారి చేతుల మీదుగా విద్యార్థులకు నోటుబుక్కులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలలో ఆర్యవైశ్యులు ముందుంటారని అన్నారు. పేద వారికి కులాలకు అతీతంగా సహాయ సహకారాలు అందించడంలో ఆర్యవైశ్యులు ముందు వరసలో ఉంటారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి యెలుగూరి నగేష్ కుమార్, మండల, పట్టణ, యువజన సంఘం అధ్యక్షులు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, అర్వపల్లి రాధాకృష్ణ, నరేంద్రుల అను, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లెర్ల చంద్రశేఖర్, యెలుగూరి మధుబాబు, పుల్లూరు సతీష్ కుమార్, గౌరిశెట్టి పురుషోత్తం, రాచర్ల వెంకటేశ్వర్లు, వాసవి క్లబ్ అధ్యక్షుడు బోనగిరి రవి కిరణ్, యెలుగూరి మల్లికార్జున్, దివ్వెన నాగేశ్వరరావు, తాటిపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తాసిల్దార్ కు సిపిఎం వినతి

## వారం రోజుల్లో లబ్ధిదారుల గుర్తించి పట్టాలిస్తామని హామీ



**ఖమ్మం రూరల్, నవభూమి, జూలై 3:** మండలంలోని ఆరెంపుల గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సిపిఎం పార్టీ ఆరెంపుల గ్రామ శాఖ ఆధ్వర్యంలో గురువారం తాసిల్దార్ రాంప్రసాద్ కు వినతి పత్రం, దరఖాస్తులు అందజేశారు. దీనిపై తాసిల్దార్ స్పందించి వారం రోజుల్లో అర్హులైన వారిని సర్వే చేసి గుర్తిస్తామని, గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములు, సీలింగ్ భూములు బాగుచేసి పేదలకు ఇండ్ల స్థల పట్టాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ పాలేరు డివిజన్ కమిటీ సభ్యులు, మాజీ జెడ్పిటిసి సభ్యులు పెరుమాళ్ళపల్లి మోహన్ రావు, ఆరెంపుల సిపిఎం పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి వల్లూరి సీతారామరెడ్డి, సభ్యులు సాదిక్, అంజద్, లబ్ధిదారులు తాటి రవివర్మ, పేరం భరత్, పెరుమాళ్ళపల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

# ప్రముఖ కవి మాల్యాశ్రీకి

## భోగోజు పురుషోత్తం-సముద్రమ్మ స్మారక సాహితీ పురస్కారం

### ■ అంతర్జాతీయ కథల, కవితల పోటీల ఫలితాలు వెల్లడి



**ఖమ్మం, నవభూమి జూలై 3:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రసిద్ధి గాంచిన కవి మాల్యాశ్రీకి ఈ ఏడాది భోగోజు పురుషోత్తం-సముద్రమ్మ స్మారక సాహితీ పురస్కారం-2025 అందజేయనున్నట్లు పురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు పురిమళ్ల సునంద, భోగోజు ఉపేందర్ పేర్కొన్నారు. ఖమ్మంలోని పురిమళ్ల ఫౌండేషన్ కార్యాలయంలో గురువారం వారు మీడియాతో మాట్లాడారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కథల, కవితల పోటీల ఫలితాలను వెల్లడించారు. అదే సందర్భంలో ఈ ఏడాది కవి మాల్యాశ్రీకి భోగోజు పురుషోత్తం-సముద్రమ్మ స్మారక పురస్కారం-2025 అందజేయాలని నిర్వహణ కమిటీ నిర్ణయించిందన్నారు. త్వరలో జరుగబోయే ఫౌండేషన్ వార్షికోత్సవ సభలో మాల్యాశ్రీకి పురస్కారంతో పాటు పది వేల నగదు అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో సాహిత్యరంగంలో విశేష కృషి చేస్తున్న సుప్రసిద్ధ కవులకు ఈ పురస్కారాన్ని ప్రతి ఏడాది అందజేస్తున్నట్లు తెలిపారు.

**పురిమళ్ల శ్రీరాములు స్మారక కథల పోటీ విజేతలు వీరే...**



పురిమళ్ల శ్రీరాములు స్మారక కథల పోటీల్లో 5 వేల నగదు ప్రథమ బహుమతిని రంగనాథ్ సుదర్శన్(ఇల్లందు) రాసిన మైలంటని మహాలక్ష్మీ కథ గెలుచుకుంది. 4 వేల నగదు ద్వితీయ బహుమతిని యస్వీ కృష్ణ(హైదరాబాద్) రాసిన ఇంధనం కథ గెలుచుకుంది. 3 వేల నగదు తృతీయ బహుమతిని జివి హేమలత(గుంటూరు) రాసిన గ్రహణం కథ గెలుచుకుంది. వెయ్యి రూపాయల కన్సోలేషన్ బహుమతులను మంత్రి ప్రగడ శ్రీనివాసరావు(ఖమ్మం) రాసిన స్వీయ శిల్పి, పెమ్మరాజు విజయురామచంద్ర(హైదరాబాద్) రాసిన డక్కీ, ఎస్‌బిఎస్ శ్రీనివాస్ పోలిశెట్టి(కాకినాడ) రాసిన డెంజరస్ డెవిల్స్, నల్లబాటి రాఘవేంద్రరావు(హైదరాబాద్) రాసిన మొట్టమొదటి అడుగు, సయ్యద్ గఫార్(హైదరాబాద్) రాసిన షికార్ కథలు ఎంపికయ్యాయి.

**పురిమళ్ల పద్మజ స్మారక కవితల పోటీ విజేతలు వీరే....**

పురిమళ్ల పద్మజ స్మారక కవితల పోటీల్లో 4 వేల నగదు ప్రథమ బహుమతికి చిందం రమేష్(జగిత్యాల) రాసిన 'విషాద కావ్యం' కవిత ఎంపికైంది. 3 వేల నగదు ద్వితీయ బహుమతికి పొత్తూరి సీతారామరాజు(కాకినాడ) రాసిన 'సాగని పయనం' కవిత ఎంపికైంది. 2 వేల నగదు తృతీయ బహుమతికి అవ్వారు శ్రీధర్‌బాబు(నెల్లూరు) రాసిన 'జూమ్ చెయ్' కవిత ఎంపికైంది. వెయ్యి రూపాయల నగదు పొందే కన్సోలేషన్ బహుమతులకు శింగరాజు శ్రీనివాసరావు(ఒంగోలు) రాసిన 'ఆరవ శక్తి', కటుకోజ్వల రమేష్(ఖమ్మం) రాసిన 'కాలధర్మం', మామిడిశెట్టి శ్రీనివాసరావు(పశ్చిమ గోదావరి) రాసిన 'మనిషతనమై మొలకెత్తి' కవితలు ఎంపికయ్యాయి. విజేతలందరికీ త్వరలో ఖమ్మంలో జరుగబోయే వార్షికోత్సవ సభలో బహుమతులను ప్రదానం చేయనున్నట్లు పురిమళ్ల సునంద, భోగోజు ఉపేందర్‌రావు తెలిపారు.

# అధికార, విపక్షాల తప్పులు

## కప్పిపుచ్చుకునేందుకు చేస్తున్న రాద్ధాంతమే బనకచర్ల

### ■ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

**ఖమ్మం, నవభూమి జులై 3:** తన వాగ్దానాల అమలులో విఫలతను తప్పించుకోవడానికి కాంగ్రెస్, తన కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి బీఆర్ఎస్ రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఉద్రేకం, విద్వేషం రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, అందులో భాగమే బనకచర్ల - పోలవరం అనుసంధాన ప్రాజెక్టుపై రాద్ధాంతం చేస్తున్నారని, ఈ రెండింటి మధ్య వివాదాన్ని పెంచి పెద్ద చేసి, పెద్దన్న పాత్ర నిర్వహించి లబ్ధి పొందుదామని కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఆరోపించారు. గురువారం ఖమ్మం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు పాలక, ప్రతిపక్ష పార్టీలు రెచ్చగొట్టే ఎత్తుగడలను అర్థం చేసుకోవాలి. ఉద్రేకాలకు గురికాకూడదు. విభజనా, ఒప్పందాలను, ముఖ్యంగా నదీ జలాల, సరిహద్దుల ఒప్పందాలను శాస్త్రీయంగా పరిష్కరించుకోవాలనీ సమన్వయంతో, సుహృద్భావంతో మెలగాలని కోరారు. కృష్ణా, గోదావరి నికర జలాల మీద హేతుబద్ధమైన పంపిణీ జరగాలి. నదీ పరివాహ ప్రాంతం, ఆ ప్రాంత అవసరాలు దృష్టిలో వుంచుకుని బచావత్ ట్రిబ్యునల్ పంపిణీ చేయాల్సి వుండింది. కానీ, ట్రిబ్యునల్ కృష్ణా జలాలను తెలంగాణా, ఆంధ్రాల మధ్య పంపిణీలో కొంత శాస్త్రబద్ధంగా లేదని తెలంగాణా భావిస్తున్నది. అలానే మిగులు జలాలు వినియోగంపై కూడా తగిన పంపిణీ జరగాలన్నారు. అలానే గోదావరి జలాలలో నికర జలాలు, మిగులు జలాలు పంపిణీలో కూడా తగిన శాస్త్రీయ నిర్ణయం తీసుకోవాలి.




తెలంగాణా, రాయలసీమ, ఆంధ్రా ప్రాంతాలన్నింటికి వాటి వాటి అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునే పంపిణీని కేంద్ర జలసంఘం రెండు రాష్ట్రాల ప్రభుత్వాలను కూర్చోబెట్టి, జాప్యం చేయకుండా పరిష్కారం చేయాలి. కానీ పాలకులు నీటి రాజకీయాలను, ఎన్నికలకు, ప్రజల విద్వేషాలకు అనుగుణంగా వాడుకోవడం, ప్రజల మధ్య చీలిక తీసుకురావటం సరికాదన్నారు.

**జూలై 9న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి**

నాలుగు లేబర్ కోడ్స్ను రద్దు చేయాలని, కనీస వేతనం 26,000 ఇవ్వాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, వ్యవసాయ ఉత్పత్తులను కనీస మద్దతు ధర ఇవ్వాలని జూలై 9న బంద్కు కార్మిక, రైతు సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఇచ్చిన పిలుపును సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ బలపరుస్తుందనీ కార్మికులు, రైతులు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# పచ్చిరొట్ట ఎరువుల వలన రైతులకు

## ప్రయోజనాలు అనేకం: కామేపల్లి ఏవో తారా దేవి

**కామేపల్లి,నవభూమి,జూలై 3 :** పచ్చిరొట్ట ఎరు వుల వినియోగం వలన రైతులకు అనేక ప్రయో జనాలు ఉంటాయని కామేపల్లి మండల వ్యవ సాయ అధికారి బి.తారా దేవి అన్నారు.వ్యవసా య శాఖ ద్వారా 50 శాతం రాయితీపై పంపిణీ చేసిన జీలుగులు వేసిన రైతు తమినీ సీతయ్య పొలాన్ని గురువారం ఆమె సందర్శించారు.ఈ సందర్భంగా పచ్చి రొట్ట ఎరువుల ఉపయోగాల ను రైతులకు వివరించారు.విత్తన మోతాదు 12 నుంచి 15 కిలోలు ఎకరానికి సరిపోతుందని,40 నుంచి 45 రోజుల దశలో రోటవేటర్ సహాయం తో భూమిలో కలియ దున్నాలని సూచించారు. 100 కిలోల సూపర్ కుళ్ళడానికి వేయాలని,సు మారుగా 30 నుంచి 35 కిలోల నత్రజని ఎకరా నికి అందుతుందని తెలిపారు.తుంగ,గరిక వంటి కలుపు మొక్కలను అడ్డుకుంటుందని,భూమి కో తను చౌడును నివారిస్తుందని అన్నారు.జింక్, మాంగనీస్ వంటి సూక్ష్మ పోషకాలను అందిస్తుం దని ఆమె తెలిపారు.



## పుచ్చకాయల వీరభద్రాన్ని పరామర్శించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**కామేపల్లి,నవభూమి,జూలై 3 :** కామేపల్లి మండలం తాళ్లగూ డెం గ్రామంలో ఖమ్మం నియోజ కవర్గం పిసిసి సభ్యులు,ఓబిసి జిల్లా అధ్యక్షులు,కామేపల్లి సొ సైటీ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం తల్లి అచ్చమ్మ ఇటీవ ల మృతి చెందిన సమాచారం తెలుసుకొని వారిని వారి కు టుంబ సభ్యులను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ,మా ర్కెటింగ్,సహకార,చేనేతల శా ఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు గురువారం పరామర్శిం చి మనో ధైర్యం కల్పించారు. ఈ సందర్భంగా అచ్చమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాల దుర్గాప్రసాద్,గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరా వు,మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ,కమటం రామకృష్ణ,బొమ్మిడి శ్రీనివాస్, తాసిల్దార్ సిహెచ్ సుధాకర్,ఎంపీడీవో జి.రవీందర్,ఏవో బి.తారా దేవి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ దమ్మాలపాటి సత్య నారాయణ,మాజీ ఎంపీటీసీలు నల్లమోతు లక్ష్మయ్య,రామ్ రె డ్డి జగన్నాథ రెడ్డి,కొండాయిగూ డెం సొసైటీ చైర్మన్ ధనియాకు ల హనుమంతరావు,తోటకూ రి శివయ్య,నల్లమోతు వెంకట నరసయ్య, మద్దిని నరసింహా రావు,నల్లమోతు రవి,ఎల్లమ ద్ది నరసింహారావు,బాల బో యిన వేలాద్రి,దారా సుందర్ రావు,పంచాయతీ కార్యదర్శు లు నాగేంద్రబాబు,విజయ్, ఏపూరి మల్లికార్జున్,పుచ్చకా యల కోటయ్య,పుచ్చకాయల వెంకటకృష్ణ,మాలోత్ బావ్ సింగ్, దొడ్ల వేణు,చల్ల మల్లయ్య,జక్కంపూడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొ న్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర




**ఎర్రుపాలెం,నవభూమి,జూలై 3:** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు,జై భీమ్,జై సంవిధాన్,రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర పెద్దగోపవరం గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి,మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు ప్రారంభించారు.ఈ పాదయాత్రలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి,బండారుమాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ విలువలను కాలరాస్తూ మనువాద రాజ్యాంగాన్ని తీసుకురావాలని ప్రయత్నాలు చేస్తుందని అన్నారు.మతవాదుల నుండి దేశాన్ని కాపాడుకోవలసిన పరిస్థితి ఉన్నదని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు శీలం శ్రీనివాసరెడ్డి,అను మోలు వెంకట కృష్ణారావు,క్లస్టర్ ఇంచార్జ్ లు కంచర్ల వెంకట నరసయ్య,పిల్లి బోసు, వసంత్ కుమార్,శీలం వెంకటరామిరెడ్డి, యన్నం వెంకట రెడ్డి,శీలం అక్కిరెడ్డి,రాజీవ్ గాంధీ,రామిరెడ్డి,పిచ్చి రెడ్డి,మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జానీ భాషా తదితర నాయకులు పాల్గొన్నారు

## నిబద్ధతతో పని చేస్తా.. కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవి ఇవ్వండి

**ఇబ్రహీంపట్నం, జులై 3 (నవభూమి ప్రతినిధి):** కాంగ్రెస్ పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే తనకు కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవి ఇవ్వాలని ఆ పార్టీ మండల కార్యనిర్వాహక అధ్యక్షులు కోడూరి రమేష్ పార్టీ నాయకత్వాన్ని కోరారు.

# గర్భకోశ వ్యాధుల ఉచిత చికిత్స శిబిరం

■ **ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**





**భద్రాచలం జూలై 3 నవభూమి ప్రతినిధి:** భద్రాచలం శ్రీ జీయర్ మట్ నందు మహిళల ఆరోగ్య వికాసం కోసం వికాస తరంగణి లయన్స్ క్లబ్ భద్రాచలం వారి సంయుక్త ఆధ్వర్యంలో స్త్రీ లకు గర్భ కోశ వ్యాధుల ఉచిత పరీక్షల శిబిరం ను శాసన సభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రారంభించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ మహిళా ఆరోగ్య వికాస్ సమన్వయ కర్త శ్రీమతి మాధవి రవీంద్ర మహిళా బృందం వారు పరీక్షలు నిర్వహించారు. భద్రాచలం వి టి ఆరోగ్యవిభాగం సమన్వయకర్త డాక్టర్ వి.జయభారతి శిబిరాన్ని పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా జరిగిన సభలోఇలాంటి స్వచ్ఛంద సేవాకార్యక్రమాలకు ప్రభుత్వం వైపునుండి లేదా తమ నుండి ఏమి సహాయం కావాలన్నా అందచేస్తామని స్థానిక శాసనసభ్యులు డా. తెల్లం వెంకటరావు తెలియచేశారు. స్త్రీల ఆరోగ్య సమస్యలు, క్యాన్సర్ పట్ల అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని డాక్టర్ జయభారతి తెలిపారు. స్త్రీల ఆరోగ్య వికాసం కోసం శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామివారు నిర్వహిస్తున్న వైద్య సేవలు, శిబిరాలను గురించి మాధవీ రవీంద్ర వివరించారు.

భద్రాచలం పురప్రముఖులు బి హరిచంద్ర నాయక్,వికాస తరంగిణి ముఖ్య సమన్వయ కర్త,లయన్స్ అధ్యక్షురాలు శ్రీమతి పిన్నింటి కమలరాజశేఖర్, ఆరోగ్య వికాస్, యువవికాస్, ఆర్థిక , ప్రజ్ఞా సమన్వయకర్తలు, చారుగుళ్ల శ్రీనివాస్, గుడికందుల నాగేశ్వరరావు, చిట్టే లలిత, జీయర్ మఠం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారులు గట్టు వెంకటాచార్య,నల్లాన్ చక్రవర్తుల శ్రీరామ చక్రవర్తి, ఇలాకి రంగారెడ్డి, వికాస తరంగిణి జిల్లా కన్వీనర్ శ్రీమతి రోజా, లయన్స్ జెడ్ సి కురిచేటి శ్రీనివాస్, లయన్స్ ప్రధాన కార్యదర్శి సిద్ధారెడ్డి, లయన్స్ రామలింగేశ్వరరావు, భీమవరపు వెంకటరెడ్డి, గాదె మాధవ రెడ్డి, శ్రీమతి సీతా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో 150 మంది మహిళలు పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షలు చేయడం వలన అందులో కొందరికి సమస్యలు ఉన్నట్లు గుర్తించామని, వీరికి తగు వైద్య సహాయం గురించి అందచేగడానికి జీయర్ మఠం ద్వారా తగు శ్రద్ధ తీసుకుంటామని జీయర్ మఠం నిర్వాహకులు తెలిపారు.

# నేడు హైదరాబాద్ ఖర్గే సభకు కాంగ్రెస్ కార్యకర్తలు తరలిరండి

■ **రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల పిలుపు**



**పాల్వంచ జులై 3 నవభూమి ప్రతినిది:** ఈ నెల 4 తేదీన అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే హైద్రాబాద్ వస్తున్న సందర్భంగా జరిగే కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి కార్యకర్తలు తరలిరావాలని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పాల్వంచ పట్టణ పరిధి అయ్యప్ప నగర్ లోగల రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుమారు 15 వేల మందితో హైదరాబాదు లోని లాల్ బహదూర్ స్టేడియంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయనున్నారన్నారు. రాబోయే స్థానిక సంఘ ఎన్నికల్లో కార్యకర్తలు చేపట్టే ప్రచార కార్యక్రమాలకు దిశా నిర్దేశం చేయనున్నారని అన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో ఖర్గేతో పాటు, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్య మంత్రి మల్లు బట్టి విక్రమార్క, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో పాటు రాష్ట్ర మంత్రులు, పిసిసి కమిటీ సభ్యులు పాల్గొననున్నారన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఆత్మీయ సమ్మేళనానికి హాజరై విజయవంతం చేయాలని కొత్వాల కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, పెద్దమ్మ గుడి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, మాజీ డైరెక్టర్ ఎస్వీఆర్కె ఆచార్యులు, ఆర్టిఏ మెంబర్ బాదర్ల జోషి కుమార్, కాంగ్రెస్ నాయకులు కాల్వ భాస్కరరావు, బద్దికిషోర్, కాపర్తి వెంకటాచారి, కందుకూరి రాము, ఉండేటి శాంతి వర్ధన్, షేక్ చాంద్ పాషా, పులి సత్యనారాయణ, డిష్ నాగేశ్వరరావు, చింత నాగరాజు, గంగిరెడ్డి భువన సుందర్ రెడ్డి మాలోత్ కోటి నాయక్, వాసుమల్ల సుందర్రావు, అలెక్స్, ఓ శెట్టి సాంబయ్య, ఎస్ కే భాష, కటుకూరి శేఖర్, బోధ శ్రీలత రెడ్డి, అరుణ రెడ్డి, భవాని, బండి నాగరాజు, కొత్తపల్లి రవి, లింగయ్య నాయక్, దాసరి యాకయ్య, దేవీలాల్, కామాచారి, కె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జులై 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

■ **తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మిడకంటి చిన్న వెంకటరెడ్డి పిలుపు**



**ఖమ్మం రూరల్, నవభూమి, జూలై 3:** జూలై 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మిడకంటి చిన్న వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులో గల సిపిఐ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం రూరల్ మండల కౌన్సిల్ సమావేశాన్ని తద్దె రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సంఘాలు అన్నీ కలిసి సంయుక్త కిసాన్ మోర్చా(కేఎస్ఎం)గా ఏర్పడి సమ్మెను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు అసంఘటిత చట్టాలను రద్దు చేయడం కుట్ర పూరిత అంశం అని ధ్వజమెత్తారు. కార్పోరేట్ శక్తులకు మేలు చేసేందుకే మోడీ ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు ఆరోపించారు. గతంలో సైతం నల్ల చట్టాలను రైతులు ఏ విధంగా ప్రతిఘటించారో... మరలా అదే పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తామన్నారు. పంటల బీమాతో పాటు స్వామినాథన్ కమిషన్ ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మామిడి సుదర్శన్ రెడ్డి, కార్యదర్శి ఏలూరి భాస్కర్, జిల్లా నాయకులు యడ్లపల్లి శంకరయ్య, వెన్నం భాస్కర్, సిపిఐ మండల కార్యదర్శి సుధాకర్, రైతు సంఘం మండల నాయకులు వెంపటి సురేందర్, మిడికంటి పెద వెంకటరెడ్డి, ధనమూర్తి, రమేష్, మామిండ్ల నిరంజన్ రెడ్డి, బొడ్డు ఉపేందర్, లక్ష్మి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీని లేకుండా చేయడమే బిజెపి లక్ష్యం - సీపీఎం




**ఖమ్మం రూరల్, నవభూమి, జూలై 3:** వామపక్షాల పోరాట ఫలితంగా ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని లేకుండా చేయటమే బిజెపి లక్ష్యమని వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి వడ్లమూడి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కస్నాతండా గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ మహాసభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. వ్యవసాయ కార్మికులను ఐక్యం చేసి ప్రభుత్వంపై ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం కస్నాతండా వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ అధ్యక్ష, కార్యదర్శులుగా ఆవిరేణి నాగరాజు, గురవయ్య ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐదుగురితో గ్రామ కమిటీ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబు, ఆవిరేణి కోటయ్య, దొడ్డ భారతమ్మ, భూక్య నాగేశ్వరరావు, వడ్లమూడి మల్లయ్య, ఊరుబండి చంద్రయ్య, భూక్య సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జూలై 9న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయండి

### ఎంపీడీవోకి సమ్మె నోటీసు అందజేసిన గ్రామ పంచాయతీ కార్మికులు

### కార్మిక చట్టాలు పరిరక్షణకై ఉద్యామిద్దాం



**ములకలపల్లి జులై 3 నవభూమి:** జూలై 9న జరిగే గ్రామీణ భారత్ బంద్ ను జయప్రదం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు చిక్కుల శ్రీను, గంటా శ్రీనివాసరావు లు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో ఎంపీడీవో ఎస్ వి సత్యనారాయణ, ఎంపీఓ వెంకటేశ్వర్లు లకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోర్టులను వెంటనే రద్దు చేయాలని చేశారు. కార్మికులకు రక్షణగా ఉన్న 29 కార్మిక చట్టాలను రక్షించాలని రాజ్యాంగా హక్కులను పరిరక్షించుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బిజెపి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోర్టులను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలని చూస్తుందని ఇటువంటి నిర్ణయాన్ని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులకు రక్షణ కిట్లు తక్షణమే అందజేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ,పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్క రుక్మధరావు, సాయి రత్న, కొక్కెర గడ్డ సతీష్, కనకం చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు

# జులై 9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

- గోడ పత్రికను ఆవిష్కరించిన టియూసిఐ
- కార్మిక సంఘాలకు విజ్ఞప్తి చేసిన సిపి ఎం



**జూలురుపాడు, జూలై 03 (నవభూమి ప్రతినిధి)–** జూల్కె 9న దేశ వ్యాపితంగా కేంద్ర కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మె పిలుపునిచ్చాయని సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టి యూ సి ఐ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులు,తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏదులాపురం గోపాలరావు పిలుపునిచ్చారు.గురువారం మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులతో కలిసి సమ్మె గోడ పత్రికలను ఆవిష్కరించారు.తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె నోటీసును యం పి డి ఓ కు అందజేశారు.ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ఏధేచ్ఛగా అమలుకు పూనుకున్నది అని ఆరోపించారు. 29 కార్మిక చట్టాలను నవీకరిస్తున్నామనే పేరుతో గతంలో పోరాడి సాధించిన హక్కులను హరిస్తూ 4 లేబర్ కోడ్స్ తీసుకురావడం జరిగిందని వీటి అమలును నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాయల సిద్ధు,నాగు, ధన్వంతరావు,వినోద్ గంధం చంటి,నిమ్మటూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి., సి పి ఎం**

ఈనెల 9వ తారీఖున జరుగు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ జూలూరుపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించి గుండెపుడి గ్రామంలో సమావేశం నిర్వహించారు. సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జరుగుతున్న సమ్మెలో కార్మిక, కర్షక అసంఘటిత రంగంలో కార్మికులు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి యాసా నరేష్,వల్లమల్ల చందర్రావు,ఇల్లంగి సీతారాములు,ఆనగంటి సత్యనారాయణ,దానయ్య, నాగమణి,మంగమ్మ పాల్గొన్నారు



# మైన్స్‌క్లోజర్‌పై కేంద్రం యత్నాలకు ప్రశంసలు

- కిషన్ రెడ్డి నేతృత్వంలో హైదరాబాద్ శాంతివనంలో బొగ్గు గనుల కన్సల్టేటివ్ కమిటీ సమావేశం




**కొత్తగూడెం జులై 3 నవభూమి ప్రతినిధి:** కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి నేతృత్వంలో గురువారం హైదరాబాద్ శివార్లలోని కాన్హా శాంతివనంలో బొగ్గు, గనుల శాఖకు సంబంధించిన కన్సల్టేటివ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో మైన్ క్లోజర్, మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ కు సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ దిశగా జరిగిన ప్రయత్నాలను అధికారులు వెల్లడించారు.

ఇకపై చేపట్టాల్సిన అంశాలపై కమిటీ సభ్యులు పలు సూచనలు చేశారు. మైనింగ్ కు సంబంధించిన పలు అంశాలను కూడా లెవనెత్తారు. వీటికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, అధికారులు సమాధానం ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి చొరవతీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మైన్ క్లోజర్ అంశంపై కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చొరవను సభ్యులందరూ ప్రశంసించారు. మైన్ క్లోజర్ సందర్భంగా మైనింగ్ కోసం భూములిచ్చి ఉద్యోగాలు పొందిన వారికి మళ్లీ ఉపాధి కల్పించడం, తదితర అంశాలను సభ్యులు లేవనెత్తారు. దీనిపై దృష్టిసారిస్తామని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఉత్పత్తిని పెంచడంతోపాటుగా, కార్మికుల సంక్షేమం, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉందని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఉద్యోగుల ఇన్సూరెన్స్ విషయంలో తమ ప్రభుత్వం చొరవతీసుకుని ప్రస్తుతం ఉన్న ఇన్సూరెన్స్ మొత్తానికి అదనంగా ప్రతి ఒక్కరికీ అదనంగా కోటిరూపాయల ఇన్సూరెన్స్ ఇస్తున్నామని వెల్లడించారు. ప్రమాదాలు జరగకుండా అన్ని రకాల చర్యలను పకడ్బందీగా తీసుకుంటున్నామన్నరు. ఈ కార్యక్రమంలో బొగ్గు ఘనుల సహాయమంత్రి సతీష్ చంద్రదూబే తో పాటు కమిటీ సభ్యులైన ఎంపీలు, గనుల శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావ్, బొగ్గు, గనుల శాఖ ఉన్నతాధికారులు, కోలిండియా చైర్మన్ పీఎం ప్రసాద్, సింగరేణి సీఎండీ బలరాం సహా వివిధ పిఎస్ యు ల సీఎండీ లు ఈ రెండు శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం హార్ట్ ఫుల్ నెస్ సెంటర్, కన్హా శాంతి వనంతో కోలిండియా, సింగరేణి ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. సింగరేణి, కాన్హా మధ్య రామగుండం లో గ్రీన్ వాల్ నిర్మాణానికి సింగరేణి ఒప్పందం కుదిరింది. కొలిండియా కూడా దేశంలోని వివిధ బొగ్గు గని ప్రభావిత ప్రాంతాల్లో అటవీ సంపద ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. అనంతరం మీడియాతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు అనేక ప్రాంతాల్లో కోల్ మైనింగ్ చేసి కోల్ తీసుకోవడం జరిగింది. కోల్ తీసుకున్న తర్వాత కోల్ బ్లాక్స్ అలాగే వదిలేశారు. సైంటిఫిక్ సిస్టమ్ లో ఆ బ్లాక్ లను క్లోజ్ చేసి ఆ ల్యాండ్ మళ్లీ ఉపయోగపడేలా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇటీవల ప్రధానమంత్రి మోడీ ఈ విషయంపై ఒక ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేసి దేశంలో ఉన్న సుమారు 143 కోల్ మైన్స్ (బొగ్గు వెలికితీత పూర్తయిన) గనులను సైంటిఫిక్ పద్ధతిలో, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో క్లోజ్ చేయాలని ఆదేశించారని, ఇందుకోసం అక్కడున్న ప్రజలకు ఉపయోగపడేలా, రైతులకు ఉపయోగపడేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని ముందుకెళ్తున్నామన్నారు కిషన్ రెడ్డి. ఈ సంవత్సరమే సుమారు 10 గనుల్లో పని మొదలు పెట్టి దాదాపు ఏడెనిమిది గనులను మూసివేశాం. రానున్న రోజుల్లో మిగతా 130 మైన్స్ అన్నిటినీ కూడా క్లోజ్ చేసి, అటవీ, పర్యావరణ పరిరక్షణ కోసం చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. .సమాజానికి ఉపయోగపడేలా వాటిని మార్చుతామని, షాద్ నగర్ లో ఉన్న హార్ట్ ఫుల్ నెస్ సంస్థ వృక్షసంపదను పెంచేదిశగా చేపడుతున్న చర్యల స్ఫూర్తితో మైన్స్ క్లోజ్ చేసిన తర్వాత సమాజానికి ఉపయోగపడేలా వృక్ష సంపద పెంచుతమని, ఇందుకోసం హార్ట్ ఫుల్ నెస్ సంస్థతో ఎంఓయూ కూడా కుదుర్చుకున్నామని మంత్రి కిషన్ రెడ్డి వివరించారు.

# 9న జరిగే సమ్మెను విజయవంతం చేయండి

(1 వ పేజీ తరువాయి) పోరాడే హక్కును, సమ్మె చేసే హక్కును, వేతనాల కోసం బేరసారాలడే హక్కులను లేకుండా చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా ప్రైవేటు పెట్టుబడుదారులకు దోచిపెట్టడానికి, సింగరేణి బొగ్గు బావులను బడా పెట్టుబడుదారులకు అప్పజెప్పడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని విమర్శించారు. పనిగంటలను పెంచి శ్రమదోపిడికి పాల్పడే ప్రయత్నాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్మిక చట్టాలను కాపాడుకోవడానికి, ప్రభుత్వ రంగాన్ని రక్షించుకోవడానికి ఈ నెల 9వ తేదీన జరగనున్న సమ్మెలో సింగరేణి అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

# పట్నం చెరువు కట్ట కింద రోడ్ పైన చెట్లను తొలగించాలి

### మున్సిపల్ కమిషనర్‌కు బీజేపీ నేతల వినతి



ఇబ్రహీంపట్నం, జూలై 3 (నవభూమి ప్రతినిధి): శేరిగూడ నుండి ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రానికి వెళ్ళే చెరువు కట్ట కింద సాగర్ రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు ముత్యాల మహేందర్ ఆధ్వర్యంలో నాయకులు మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మున్సిపల్ అధ్యక్షులు ముత్యాల మహేందర్, బీజేవైయం జిల్లా నాయకులు మైలారం విజయ్ కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆడపు రాఘవేంద్ర లు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం చెరువు కట్ట గుండా సాగర్ రహదారికి ఇరువైపులా ఉన్న చెట్ల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. చెట్ల వల్ల రహదారి, వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. వెంటనే తగు చర్యలు చేపట్టి రోడ్డు పైకి పెరుగుతున్న చెట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైయం జిల్లా నాయకులు అనిల్, రూపక్ సాగర్, బీజేపీ మున్సిపల్ నాయకులు జోగ్రిగల అశోక్, ఆకుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఐపిఒ కోసం గోప్యంగా డిఆర్ హెచ్‌పి దాఖలు చేసిన గజా ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్

హైదరాబాద్ 03, జూలై (నవభూమి): గజా క్యాపిటల్ బ్రాండ్ కింద కార్యకలాపాలను నిర్వహించే గజా ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్, తమ ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ కోసం రెగ్యులేటర్ వద్ద రహస్య డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్(డిఆర్హెచ్పి) ను దాఖలు చేసింది. 2004లో కార్యకలాపాలను ప్రారంభించిన సంస్థ విద్య, వినియోగదారు , ఆర్థిక సేవల రంగాలతో సహా పలు రంగాలలో విస్తరించి ఉన్న కంపెనీలకు మూలధనాన్ని అందిస్తుంది. జనవరి 2025లో కంపెనీ ప్రైవేట్ నుండి పబ్లిక్ లిమిటెడ్‌గా మారి, తమ పేరును గజా ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్‌గా మార్పు చేసుకుంది. ఈ నెల ప్రారంభంలో ప్రీ-ఐపిఓ నిధుల సేకరణ రౌండ్‌లో కంపెనీ రూ. 125 కోట్లు సేకరించింది, దీని విలువ రూ. 1,625 కోట్లు. కొత్త ఇష్యూ ఆదాయం ఫండ్ మేనేజర్ల మూలధనాన్ని కొత్త నిధులను సీడ్ చేయడానికి మరియు భారతదేశం , విదేశాలలో పంపిణీ సామర్థ్యాలను విస్తరించడానికి ఉద్దేశించబడినది . ఇది కొత్త ఫండ్ నిర్వహణ వ్యూహాలలోకి విస్తరించడానికి ఉపయోగించబడుతుంది. 2004లో స్థాపించబడిన గజా క్యాపిటల్, పనితీరు, విలువ సృష్టిలో చక్కటి ట్రాక్ రికార్డ్‌తో భారతదేశపు మొట్టమొదటి సంస్థాగత , స్వతంత్ర ప్రైవేట్ ఈక్విటీ సంస్థగా స్థిరపడింది. సంస్థ డైరెక్టర్ల బోర్డుకు శ్రీ యు.కె. సిన్హా (నాన్-ఎగ్జిక్యూటివ్ చైర్మన్) అధ్యక్షత వహిస్తున్నారు.

# ప్రజలకు ఏ అవసరం ఉన్నా ముందు నిలబడతా

### ■ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ







అశ్వారావుపేట జూలై 3 నవభూమి: అశ్వారావుపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు జారె ఆదినారాయణ ప్రభుత్వ పథకాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన చేతుల మీదుగా ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఆడబిడ్డలకు మేనమామగా వ్యవహరిస్తూ, మొత్తం 47 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలకు ఎటువంటి అవసరం ఉన్న వారి ముందు నిలబడతా అని అన్నారు అదేవిధంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద కుటుంబాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకం వేలాది కుటుంబాల ఆశలు నెరవేర్చుతుందన్నారు. అలాగే, సామాన్యుడి వివాహ ఆర్థిక భారం తగ్గించేందుకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కుటుంబానికి పెద్ద దిక్కుగా మారాయని ఆయన అన్నారు. అశ్వారావుపేట మండలంలోని 30 గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు గురువారం ఈ చెక్కులు పంపిణీ చేశారు. అశ్వారావుపేట మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాల్లో భాగంగా కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం కింద మొత్తం 92 చెక్కులను (రూ. 92,10,672 విలువైనవి) ఎమ్మెల్యే జారె పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 14 మంది లబ్ధిదారులకు 4,78,500 రూపాయలు తక్షణ సహాయం అందించడం జరుగుతోందని వివరించారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల మేలు అందేలా తన నియోజకవర్గంలో చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు నియోజకవర్గ నాయకులు మండల నాయకులు కార్యకర్తలు యువకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

### ■ ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్

పాల్వంచ జూలై 3 నవభూమి ప్రతినిధి: గిరిజన సంక్షేమ శాఖ క్రీడా పాఠశాలల్లో చదువుతున్న బాలురకు వివిధ క్రీడలలో నిష్ణాతులను చేసి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు, వారికి ప్రత్యేకమైన మెనూ అందించడం జరుగుతుందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. గురువారం పాల్వంచ డివిజన్లోని కిన్నెరసాని క్రీడా పాఠశాలను ఆయన సందర్శించి పిడీలు, పి ఈ టి లు, కోచులు విద్యార్థులకు సాధన చేస్తున్న క్రీడలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పాఠశాలల్లో చదివే బాల బాలికలకు చక్కటి విద్యతో పాటు ప్రత్యేకమైన వారికి ఇష్టమైన క్రీడలలో తర్ఫీదు పొంది సాధన చేయడానికి నిష్ణాతులైన కోచులు పీడీలతో ప్రతిరోజు సాధన చేయించడం జరుగుతుందన్నారు. సంబంధిత పీడీలు, కోచులు విద్యార్థుల ఆట తీరును గమనించి, వాటికి సంబంధించిన మెలకువలను ఎప్పటికప్పుడు అందిస్తూ ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి వారికి ఇష్టమైన క్రీడలలో ఆదే విధంగా చొరవ చూపాలని అన్నారు. సంబంధిత హెచ్ఎం, వార్డెన్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారికి సమయానుకూలంగా ప్రత్యేకమైన మెనూ ప్రకారం భోజనము అందించాలని, ఉదయం సాయంత్రం తప్పనిసరిగా క్రీడలలో సాధన చేయించాలని అన్నారు. అనంతరం 12 లక్షల విలువ గల 240 మంది బాలురకు క్రీడా దుస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ, స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు, అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకట్ నారాయణ, కోచులు, పిడిలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.









# కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌ను కలిసిన బండి రమేష్

### ■ నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలని వినతి

కూకట్‌పల్లి, జూలై 3, (నవభూమి ప్రతినిధి): కూకట్‌పల్లి నియోజకవర్గ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ గురువారం జోన్ కార్యాలయాన్ని సందర్శించారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన బండి రమేష్, ప్రజలు ఇబ్బంది పడుతున్న సమస్యలపై చర్చించారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా పూర్తిచేయాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. నయాపైప్‌లైన్‌లు, డ్రైనేజీ మార్గాల పరిశుభ్రత వంటి అంశాలపై చొరవ చూపాలని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

# కూకట్‌పల్లి సీఐ రాజేష్ బదిలీ

## సీపీ అవినాష్ మహంతి ఉత్తర్వులు



**కూకట్‌పల్లి, జూలై 3 ( నవభూమి ప్రతినిధి):** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న పలు పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ అవినాష్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్పులలో భాగంగా కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న సీఐ రాజేష్‌ను రాజేంద్రనగర్ సిసిఎస్ విభాగానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో కమిషనరేట్‌కి చెందిన ఎకనామిక్ ఆఫెన్సెస్ వింగ్ లో పనిచేస్తున్న వెంకట సుబ్బారావును కొత్తగా కూకట్‌పల్లి సీఐగా నియమించారు. కాగా సిఐ రాజేష్ కూకట్ పల్లి ప్రాంతంలో విధినిర్వహణ లో పలువురి మన్నలను పొందారు. సంబంధిత ప్రాంతాల్లో పోలీసులు త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రజల అవసరాల పరిష్కారానికి కొత్తగా నియమితులైన అధికారులు కృషి చేస్తారని పోలీస్ వర్గాలు పేర్కొన్నాయి. సేవా పరిరక్షణ, పరిపాలనా అవసరాల దృష్ట్యా ఈ బదిలీలు చేసినట్టు అధికారులు తెలిపారు

# గౌతమ్ నగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న యుఎల్‌సి సమస్యపై కలెక్టర్‌ను కలసి విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే మర్రి , కార్పొరేటర్ మేకల



**మల్కాజిగిరి – నవభూమి ప్రతినిధి :** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని గౌతమ్ నగర్ డివిజన్ లో దశాబ్దం కాలం పాటు పెండింగ్ లో ఉన్న యు ఎల్ సి సమస్యను పరిష్కరించాలని కోరుతూ పలు కాలనీల ప్రజలతో కలిసి వెళ్లి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ను గురువారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ విజ్ఞప్తి చేశారు. మల్లికార్జున నగర్ యు ఎల్ సి సమస్య వల్ల ఇక్కడి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వారు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, బైరు అనిల్ కుమార్, మల్లికార్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటయ్య, అచ్యుతా రావు, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

# రాష్ట్ర మంత్రి లక్ష్మణ్ కుమార్‌ను సత్కరించిన నేతలు



**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి జూలై 3:** షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ లక్ష్మణ్ కుమార్ ను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి సయ్యద్ ఫస్సి హుస్సేన్ శాలువాతో సత్కరించారు ఉమెర్ఫోత్వాల్ చైర్మన్ ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హరి సింగ్, సత్తార్ తో పాటు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు

# విద్యార్థి ఉద్యమాల దిక్సూచి ఏఐఎస్ఎఫ్

- విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలుకు సిద్ధం కండి
- విద్యా కాషాయీకరణ కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం
- పెండింగ్ స్కాలర్షిప్, ఫీజురీయింబర్స్మెంట్ పెండింగ్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్




**పాల్వంచ జులై 3 నవభూమి ప్రతినిది:** విద్యార్థి ఉద్యమాల దిక్సూచి ఏఐఎస్ఎఫ్ అని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. గురువారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్ లో ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 4వ జిల్లా మహాసభ నిర్వహించారు. మహాసభ ప్రారంభ సూచికగా ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్ అరుణ పతాకాన్ని ఆవిష్కరణ చేశారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ బ్రిటిష్ పరాయి పాలకుల చెర నుండి భరతమాత విముక్తి కోసం విద్యార్థులను అందరిని ఒక్క తాటిపైకి తీసుకురావటానికి లక్నో నగరాన బెనారస్ విశ్వవిద్యాలయంలో 1936 ఆగస్టు 12న అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆవిర్భవించిందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం అనంతరం విద్యారంగ సమస్యల పరిష్కారమే ఏకైక లక్ష్యంగా ఆనాటి నుండి నేటి వరకు సమరశీల ఉద్యమాలు కొనసాగిస్తున్న ఈ దేశ ప్రథమ విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై, కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో విద్య ఉపాధి హక్కుల సాధనకై సమరశీల పోరాటాల కు సిద్ధం కావాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం వల్ల పేద మధ్యతరగతి విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడుతుందని, కేవలం డబ్బున్న వాళ్ళే విద్యను అభ్యసించే రోజులు రాబోతున్నాయని, ఇటువంటి విద్యా వ్యతిరేక నూతన విద్యా విధానాన్ని తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా దళిత గిరిజన మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ దేశంలో పుట్టిన ప్రతి బిడ్డకు సమానమైన విద్యను అందించాలని డిగ్రీలు పూర్తి చేసిన ప్రతి విద్యార్థికి భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ ఆక్ట్ అమలు చేసి, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎంఈఓ, ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేసి, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెండింగ్ స్కాలర్షిప్, రియంబర్స్మెంట్సు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల రామకృష్ణ మాట్లాడుతూ పూర్తిస్థాయి వార్డెన్లు లేక సంక్షేమ హాస్టల్లో సమస్యలతో విలియతాండనం చేస్తున్నాయని, సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యంతో విద్యారంగం తీవ్రంగా నష్టపోయిందని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందన సమస్యల నిలయంగా ఉన్నాయని నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లపై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వర్క అజిత్, యు హరీష్, షాహిద్, రణధీర్ అధ్యక్షతన జరిగిన మహాసభలో మాజీ జిల్లా సహాయ కార్యదర్శి చాంద్ పాషా, జిల్లా కార్యదర్శి పహీమ్ దాదా, అధ్యక్షుడు జర్పుల ఉపేందర్, గుండాల సుజన, పవన్ సాయి, నాగేంద్ర బాబు, బతుల సాయి, వినయ్, వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.







# నాలాల ఆక్రమణలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ సీరియస్

- బాలానగర్ వినాయకనగర్‌లో పరిశీలన
- గేటు తాళం పగలగొట్టిన కమిషనర్
- నాలా మొదటి నుండి చివరి వరకు డ్రోన్ కెమెరాలతో వీడియో చిత్రీకరణ చేస్తాం



**కూకట్‌పల్లి, జూలై 3 (నవభూమి ప్రతినిధి):** హైదరాబాద్ మున్సిపల్ హైడ్రాలిక్ కమిషనర్ రంగనాథ్ గురువారం బాలానగర్ పరిధిలోని వినాయకనగర్, కళ్యాణినగర్, సాయినగర్ కాలనీల్లో నాలా ఆక్రమణలపై ఆకస్మికంగా పర్యటించారు. ఆయనతో పాటు అధికారులు, స్థానిక కాంగ్రెస్ నేతలు కూడా పాల్గొన్నారు. కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎ-బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి స్వాగతం పలికిన అనంతరం, కమిషనర్ రంగనాథ్ వినాయకనగర్ గడ్డి చేను సమీపంలోని నాలాను పరిశీలించారు. అయితే నాలాకు వెళ్లే దారిలో గేట్లు వేసి, తాళాలు వేసిన విషయంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందనలో రంగనాథ్ అధికారులను ఆదేశిస్తూ తాళం పగలగొట్టి లోపలికి వెళ్లారు.

**నాలా కబ్జాపై కమిషనర్ ఆగ్రహం.....**

తాళాలు తీసిన అనంతరం నాలా ప్రవాహ మార్గాన్ని పరిశీలించిన కమిషనర్, ఆక్రమణలు స్పష్టంగా కనిపించడంతో చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నాలా అడ్డు ఎంత ఉండాలో లెక్కలు ప్రకారం కొలిచి, కబ్జాలను తొలగించాలన్నారు.. గడ్డి చేనులో పోసిన మట్టిని పూర్తిగా తీసేయాలని స్పష్టం చేశారు. కళ్యాణినగర్, సాయినగర్ పర్యటన

తర్వాత కమిషనర్ కళ్యాణి నగర్ చివరి ప్రాంతాలు, సాయినగర్ సాయిబాబా ఆలయం వద్ద నాలా పరిసరాలను పరిశీలించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ ప్రాంతాలు వరద ముంపుకు గురవుతున్నాయని పేర్కొన్నారు. డ్రోన్‌తో వీడియో డాక్యుమెంటేషన్ నాలా మొదటి నుండి చివరి వరకు డ్రోన్ కెమెరాలతో వీడియో తీసి, పూర్తిగా డాక్యుమెంట్ చేస్తామన్నారు. వారం రోజుల్లో కాలనీ ప్రజలతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఖాళీ స్థలాల్లో, నాలాలో ఎవరు ఆక్రమణ చేశారో తక్షణం తొలగిస్తామని చెప్పారు.

# గోషామహల్ సీటు టిడిపి దే:
## రాజాసింగ్‌కు సవాల్ విసిరిన ప్రశాంత్ నందేష్ యాదవ్



**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి జూలై3:** బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ కు దమ్ము ధైర్యం ఉంటే స్పీకర్ ఫార్మేట్లో రాజీనామా సమర్పించాలని గోషామహల్ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ ప్రశాంత్ నందేష్ యాదవ్ సవాల్ విసిరారు. ఈ మేరకు ఆయన గురువారం గోషామహల్ లో విలేకరులతో ప్రసంగించారు. స్పీకర్ ఫార్మెట్లో రాజీనామా ఇవ్వకుండా బిజెపి నేత కిషన్ రెడ్డికి రాజీనామా సమర్పిస్తున్నట్లుగా వినతి పత్రం అందజేయడం హాస్య స్పదంగా ఉందన్నారు. రాజాసింగ్ స్పీకర్ ఫార్మేట్ లో రాజీనామా చేస్తే రాజకీయ భవిష్యత్తు ఉండదన్నారు. ఇదే ఆయనకు చివరి అవకాశమవుతుందని జోష్యం చెప్పారు. స్పీకర్ ఫార్మేట్ లో రాజీనామా చేసి తిరిగి ఎన్నికల్లో నిలబడితే తన బలం ఏమిటో తెలుస్తుందని అన్నారు. రాజాసింగ్ ఇలాంటి బెదిరింపు రాజకీయాలు చేయడం సాధారణమే అన్నారు. నేనే నియోజకవర్గానికి దిక్కు అన్న ధీమాతో రాజాసింగ్ ఉండడం ఆయన అవివేకానికి నిదర్శనం అన్నారు. హైదరాబాదు మున్సిపల్ ఎన్నికల్లో టిడిపి పోటీ చేస్తుందని అత్యధిక సీట్లను గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. గోషామహల్ లో ఉప ఎన్నిక వస్తే అభ్యర్థి ఖరారు విషయం అధినేత చంద్రబాబు నాయుడు చూసుకుంటారని పేర్కొన్నారు.

# మల్కాజ్గిరి నియోజకవర్గంలో ప్రభుత్వ భూములను రక్షించండి







**అల్వాల్ ,నవభూమి ప్రతినిధి, జూలై 3:** ప్రభుత్వ భూములను కబ్జా దారుల నుండి కాపాడండి మల్కాజ్గిరి ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టరేట్లో కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి నీ మల్కాజ్గిరి నియోజకవర్గం సీనియర్ నాయకులు కార్పొరేటర్లతో కలిశారు. గురువారం నాయకులతో కార్యకర్తలతో కలిసి మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్లో సమావేశమయ్యారు . ముఖ్యంగా డంపింగ్ యార్డ్ ను తొలగించి ముందు స్మశాన వాటిక గ తీర్చిదిద్దాలని రాక్ ఎంక్లేవ్ లో పట్టాదారులను గుర్తించి వారి ప్లాట్లను కేటాయించాలని కబ్జాకు గురి అవుతున్న భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడి ప్రభుత్వ ఆఫీసులకు కేటాయించాలని విన్నవించారు సానుకూలంగా స్పందించి 15, 20 రోజులలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి తెలియపరిచారు ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శాంతి శ్రీనివాసరెడ్డి సునీత రాము యాదవ్ బద్దం పరుశరామిరెడ్డి రాము యాదవ్ అనిల్ కిషోర్ గౌడ్ డోలి రమేష్ మెమోరీ శ్రీధర్ గౌడ్ పాల్గొన్నారు